హనీబీఎపి

సంపుటి 3, సంచిక 2

అక్టోబర్ - డిసెంబర్ 2008

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



## సహజ వ్యవసాయ పద్ధతి రైతుకు మేలు చేయగలదా?

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :

- 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.
- నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.
- నలుగురు ఇన్నోవేటర్లను అహమ్మదాబాద్ లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం జరిగింది. వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.
- వందలాది తెలుగు ప్రజలతో టెలిఫోన్ ద్వారా హనీబీ గురించి చర్చించడం, వారికి తెలియజేయడం.
- గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 5వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి వందకు పైగా ఎంట్రీలు పంప బడ్డాయి.
- పారిశ్రామికవేత్తలు, అనధికార సంస్థలు, హనీబీ మూల పురుషుడు శ్రీ అనిల్ గుప్తా గారి సమక్షంలో 12 మంది తెలుగు ఇన్నోవేటర్లు ఆవిష్కరణలను ప్రదర్శించారు.
- ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.
- కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.
- నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధయాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను వెలికి తీయడం జరిగింది.
- ఇప్పటి వరకు 8 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.
- టి.ఇ.పి.పి. ఛైర్మన్, డా. ఎ.ఎస్. రావు గారితో 16 మంది ఇన్నోవేటర్లతో ముఖాముఖి ఏర్పాటు చేయడం జరిగింది.
- తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.
- హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.
- జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.
- ఫిబ్రవరి 2008లో మహబూబ్ నగర్ జిల్లా ఉత్తనూరు గ్రామంలో జరిగిన వ్యవసాయ ప్రదర్శనలో సంప్రదాయ జ్ఞానం, తమ అన్వేషణలను ఇన్నోవేటర్లు రైతులతో పంచుకున్నారు.
- మ్యాట్రిక్స్ సంస్థలో ఇద్దరు ఆవిష్కర్తల హెర్బల్ మందులను మార్కెట్ చేయటానికి ఒప్పందం కుదిరింది.
- ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో శోధయాత్రను జనవరిలో నిర్వహించి, స్థానిక జ్ఞానాన్ని సేకరించడం జరిగింది.
- సెప్టెంబర్ 2008లో అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఇద్దరు హనీబీఏపి కార్యకర్తలు 'స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ వర్క్‌షాప్'లో పాల్గొనడం జరిగింది.
- అలేరు నివాసి, ఉత్తమ ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ ఇన్నోవేషన్ సమావేశానికి ఆహ్వానించబడ్డారు.
- నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.
- మరో నాలుగు కళాశాలల్లో 'సృష్టి' విద్యార్థుల క్లబ్బులు ప్రారంభమయ్యాయి. దీంతో రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో మొత్తం 8 క్లబ్బులు 'పల్లెజ్ఞానోపార్జనకు' విశేషంగా కృషి చేస్తున్నాయి.

**మా కలలు :**

- ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.
- పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

– బ్రిగేడియర్ పి. గణేశం,
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 2 అక్టోబర్ - డిసెంబర్ 2008

**సంపాదకవర్గం**

సంపాదకులు :

**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :

**డా. కె.ఎల్. రావు**
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. వై.వి. రావ్**
**శ్రీమతి అరుణ గణేశం**
**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040- 40179462, 30627739
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన
102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com

## ఈ సంచికలో...

❁ పల్లె సంప్రదాయ జ్ఞానం : జె. పద్మ అపూర్వ సేకరణ - 3
❁ జపాన్ రైతు ఫ్యుకువోకా వినూత్న వ్యవసాయం -6
❁ రైతుల కష్టాలకు నిరాశకు స్థిరమైన పరిష్కారాన్వేషణ - 8
❁ ఏరియల్ రోప్‌వే (గాలిత్రాళ్ళ త్రోవ) కల్లుగీత కార్మికులకు ఎంతో ఉపయోగకరం! - 10
❁ పూసర్ల ఆలోచనకు రూపం వస్తే..... -11
❁ అహమ్మదాబాద్ వర్క్‌షాప్ అనుభవాలు - 12
❁ 'అన్వేషణ' కు దిశా నిర్ణయం అవసరమా? -16
❁ ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు - 17
❁ ఇగ్నైట్ - 2009 - 20
❁ వరంగల్ జిల్లా ఆదివాసుల (కోయ) సంస్కృతి-ఆచారాలు - 22
❁ స్పందన - 27

**కవర్ లోపలి పేజీల్లో :**

హనీబీఎపి ప్రగతి

## ఆముదపు నూనెతో డీజిల్ ఇంజన్

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : Brig. P. Ganesham, VSM (Poorva Senani), on behalf of "HoneyBeeAP"
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.



# సంపాదకీయం

2005లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన 'హనీబీఏపి' గ్రామీణ సృజనా శక్తిని వెలికి తీసే ప్రయత్నంలో ముందుకు సాగుతున్నది. 83 మంది ఇన్నోవేటర్ల క్రియాశీల ప్రయోగాలను, 1000కి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని ఇప్పటివరకు సేకరించింది. వాలంటీర్లు, విద్యార్థులు ప్రధాన పాత్ర నిర్వహించడం వల్ల ఈ స్థాయికి చేరుకోవడమైనది. కానీ, చేసింది కొంచెం మాత్రమే ఇంకా చేయాల్సింది ఎంతో వుంది. అందుకు మీ అందరి చేయూత ఎంతైనా అవసరం. 'ఆవిష్కరించండి.... ప్రోత్సహించండి..... మరుగుపడిన జ్ఞానాన్ని వెలికి తీయండి.....

జ్ఞానాన్ని సేకరించడం ఒక వంతైతే దాని మూల్యాన్ని పెంచి, పదిమందికి పనికి వచ్చేట్టు తయారు చేయడం, పరిశోధనా శాలల్లో నిరూపించడం, అవసరమైతే దాని విలువను పెంచడం.... ఇవన్నీ సాధించడమే హనీబీఏపి ఉద్దేశ్యం. వీటిలో కొన్ని మార్కెట్లోకి తీసుకు రావచ్చు. దానికై చిన్న చిన్న పారిశ్రామికవేత్తల సహకారం, చొరవ ఎంతైనా అవసరం.

వీటిని సాధించడంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశోధన శాలలు, సాంకేతిక, వ్యవసాయ కళాశాలల సహకారం అత్యవసరం. అనుకున్నంత స్థాయిలో ఈ సంస్థల నుండి హనీబీఏపికి ప్రోత్సాహం లభించడం లేదు. దీని కారణంగా ఇన్నోవేషన్లు మార్కెట్లోకి రావటానికి చాలా సమయం పడుతున్నది. హనీబీఏపిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న గ్రామీణ ఇన్నోవేటర్ల కలలను మనమంతా నిజం చేయాలి. ఈ యజ్ఞంలో మీ అందరి తోడు మాకు అత్యంత ప్రధానం.

రాష్ట్ర నలుమూలల నుండి మాకు పల్లె సృజన గురించి స్పందిస్తూ అనేకమంది పాఠకులు టెలిఫోన్ చేస్తున్నారు. 'పల్లెసృజన' సంచికలను ఎన్నిసార్లు చదివినా చదవాలనిపిస్తున్నాయని తొర్రూరు నుండి శ్రీ గోపాల్ రెడ్డి గారు, మీ పాత సంచికలను చూశాను, వెంటనే సభ్యత్వం తీసుకోవాలనిపించింది అని విశాఖకు చెందిన ప్రొఫెసర్ అరుణ గారు, పాత సంచికలన్నీ పంపమని తుమ్మలూరు నుండి కొండా కిషోర్ రెడ్డి గారు లాంటి వారు మాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ఈ స్పందనకు సంపాదకవర్గం పాఠకులకు, తెలుగు జాతికి మనఃపూర్వక కృతజ్ఞతలను తెలియజేస్తున్నది.

హనీబీఏపి వాలంటీర్లు వరంగల్ జిల్లాలో ఆదివాసులతో 'జ్ఞాన సముపార్జన యాత్ర'లో మూడు రోజులు గడిపారు. వారి ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ పద్ధతులను గురించి, వారిలో ఒకరు శ్రీ సమ్మయ్య ఆదివాసి పెద్దలను సంప్రదించి, ఎంతో శ్రమతో వివరంగా వ్రాసి మాకు అందించారు. యధాతథంగా ప్రధమ భాగాన్ని ఈ సంచికలో అందిస్తున్నాము.

మీ సలహాలు, విమర్శలు, మీ రచనలు, మీ ఆలోచనలు మాతో పంచుకుంటారని ఆశిస్తూ....

భవదీయ

**'బ్రిగేడియర్' గణేశం**

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం. -సంపాదకవర్గం

# పల్లె సంప్రదాయ జ్ఞానం : జె. పద్మ అపూర్వ సేకరణ



నాపేరు జె. పద్మ, నేను సింగరేణి మహిళా కళాశాల, కొత్తగూడెంలో బి.యస్‌సి (బి.జడ్.సి.) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. నేను వివరిస్తున్న ఈ సాంప్రదాయ జ్ఞానం మా నాన్నగారైన జె. అర్జున్, మా పిన్నిగార్లయిన లత, యశోదల మార్గదర్శకత్వంతో సేకరించాను. హనీబీఏపి జరిపే ఆయుర్వేద మొక్కల శోధనలో నేను నావంతు కృషి చేయాలని వీటిని సేకరించి పంపుతున్నాను. హనీబీఏపి ఇంకా ఎన్నో శోధయాత్రలు చేసి గ్రామాల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని కోరుకుంటున్నాను. హనీబీఏపి సంస్థ గ్రామాల్లో దాగివున్న జ్ఞానాన్ని, సృజనాత్మకతను వెలికి తీసి మన దేశాభివృద్ధికి పాటుపడే సంస్థగా మా తెలుగు లెక్చరర్ డా. కనకదుర్గ గారు మాకు తెలియజేశారు. మొక్కలలో దాగివున్న ఔషధ శక్తుల పరిజ్ఞానాన్ని పెద్దల దగ్గర గ్రహించి 'పల్లెసృజన'కు పంపుతున్నాను.

**1.పొంగు వ్యాధి (అమ్మవారు సోకితే) :**

పొంగు వ్యాధి సోకితే ఆ మచ్చలు పోవడానికి వేపాకు, పసుపు నూరి ఆ మిశ్రమాన్ని నూరి ఒళ్ళంతా పట్టించి ఒక గంట తర్వాత చల్లని నీటితో స్నానం చేయించాలి. అపుడు శరీరం అంతా చల్లగా వుండి మచ్చలు కూడా తగ్గుతాయి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే మచ్చలు తగ్గిపోతాయి. తల్లి అయినపుడు కడుపులో మంట వుంటే ఈ వేపాకు, పసుపు తాగించాలి.



**2. జిల్లేడు పాలు :**

అరచేతులు తిమ్మిర్లు పట్టినా, చేతులు గుంజినట్లున్నా, జిల్లేడు పాలు పోసి అరచేతిలో పసుపు వేసి రాయాలి.

**3. చింతపండు, మిరియాలు :**

పైత్యం చేస్తే చింతపండు, మిరియాలు నూరి ఒంటికి రాయాలి. ఇలా చేస్తే పైత్యం తగ్గడమే కాదు, కంతులు, దురదలు కూడా తగ్గుతాయి.

**4. కాకరకాయ :**

కాకరకాయ ం రసం చేసి దాన్ని తాగిస్తే మధుమేహం (షుగర్) కంట్రోల్‌లో వుంటుంది.



**5. ఉల్లిగడ్డ :**

వేడి గడ్డలు అయినట్లయితే ఉల్లి గడ్డను మెత్తగా దంచి, గడ్డ ఉన్నచోట గుడ్డలో పెట్టి గట్టిగా కడితే తగ్గిపోతాయి.



**6. నారింజ రసం :**

అధిక రక్తపోటు (హై.బి.పి.) ఉన్నవారు నారింజ రసాన్ని తాగితే బి.పి. కంట్రోల్‌లో వుంటుంది.

**7. తమలపాకులు :**

పసిపిల్లలకు జలుబు చేస్తే ఈ ఆకును పసుపులో కలిపి వేడి చేసి మాడపైన, ఛాతిపైన రాస్తే జలుబు తగ్గుతుంది.

**పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.**

**8. అల్లనేరేడు ఆకు + దానిమ్మ ఆకు :**

రక్త విరేచనాలు, చీము విరేచనాలు అయితే అల్లనేరేడు, దానిమ్మ ఆకులను నూరి రసం తాగాలి. అపుడు విరేచనాలు తగ్గుతాయి.

**9. గోరింటాకు :**



కాళ్ళు, చేతులు తిమ్మిర్లు వచ్చినపుడు గోరింటాకును నూరి కాళ్ళపై రాస్తే తిమ్మిర్లు తగ్గుతాయి. వేడి కూడా తగ్గుతుంది.

**10. శొంఠి :**

కళ్ళలో మంటలుగాని, కాళ్ళపై పొర వచ్చినపుడు శొంఠిని నూరి దాన్ని కాళ్ళపై రాస్తే మంటలు తగ్గుతాయి. తల నొప్పిగా వుంటే కూడా టీలో శొంఠిపొడి వేసుకుని తాగాలి.

**11. కలబంద (అలోవీర) :**

సీసం ముక్కలుగాని, ఇనుప వస్తువులుగాని గుచ్చినపుడు గుర్రం పాదం, మడిమ శూలలు వచ్చినపుడు కలబందను నిప్పులపై వేడి చేసి దాన్ని పాదంపై గుడ్డలో కట్టుకట్టవలెను. నొప్పి తగ్గి సీసం ముక్కలు బయటకు వస్తాయి. గాయాలు, పుండ్లు అయినా కలబంద కొమ్మను తీసుకుని దాన్ని మెత్తగా నూరి, గాయాలపై రాస్తే పుండ్లు, గాయాలు మానుతాయి.



**12. బొమ్మిడికాయలు :**

పిల్లలకు సందులు వచ్చినపుడు బొమ్మిడికాయలను ఐదింటిని మెడలో వేయాలి. సందులు తగ్గుతాయి.

**13. సీతాఫలం ఆకు :**

వేడి గడ్డలు అయితే సీతాఫలం ఆకును నూరి దాన్ని ఆ గడ్డపై రాస్తే గడ్డలు మాయమౌతాయి.

**14. దానిమ్మ తొక్క రసం :**



చిన్న పిల్లలకు వాంతులు, విరేచనాలు అయితే దానిమ్మ తొక్కలను మెత్తగా నూరి రసం తీసి పిల్లలు తాగితే వాంతులు, విరేచనాలు తగ్గుతాయి.

**15. వెంపలి ఆకు :**

దెబ్బలు తగిలి గాయాలు అయినపుడు వెంపలి ఆకును వేయించి, గాయం అయినచోట ఆకును సన్నని వేడిగా వుండగానే ఆ గాయాలపై కట్టు కడితే గాయాలు మానుతాయి.

**16. తులసి ఆకు, వాము, ఎల్లిపాయ :**

చిన్న పిల్లలకు కడుపునొప్పి, దగ్గు వస్తే తులసి ఆకు, వాము, ఎల్లిపాయ మూడింటిని కలిపి నూరి రసం పిండాలి. ఆ రసాన్ని పిల్లలు తాగితే కడుపు నొప్పి, దగ్గు తగ్గుతాయి.

**17. ఆముదపు నూనె :**

ఈ నూనెను ఎండలో తిరిగే వాళ్ళు తలకు పెట్టుకుంటే కళ్ళకు చలువగా వుంటుంది.

**18. జామపండ్లు :**

జామకాయలను ఉదయాన్నే పరగడుపున తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిలో సి-విటమిన్ ఎక్కువగా వుంటుంది.

**19. రావి ఆకు :**

ఈ ఆకును నూరి వచ్చిన రసాన్ని గజ్జి ఉన్నచోట రాస్తే గజ్జి తగ్గుతుంది.

**20. దొండ ఆకు, చెమ్మ ఆకు :**

పసిపిల్లలకు పొక్కులు వస్తే దొండ ఆకు, చెమ్మ ఆకులను నూరి పొక్కులపై రాస్తే పొక్కులు తగ్గుతాయి.

**21. జట్టుపాకు ఆకు :**

జుట్టుపాకు ఆకును మెత్తగా నూరి, దానిలో ఉల్లిగడ్డ, పసుపు, నూనె వేసి దీపం గిన్నె (ప్రమిద)లో ఉడికించి, గాజు ముక్కలు గుచ్చుకున్నచోట గుడ్డలో వేడిగా వుండగానే కట్టాలి. దీనివల్ల గాజుముక్కలు వెంటనే బయటికి వస్తాయి.

**22. బండి గురిజాకు :**

బండి గురిజాకును నలిపి దాన్ని కీళ్ళ నొప్పులు ఉన్నచోట రాసి వేడినీటితో స్నానం చేస్తే నొప్పులు తగ్గుతాయి.

**23. గవద బిళ్ళలు :**

గొంతుకు ఇరువైపులగాని, ఒకవైపుగాని ఈ గవద బిళ్ళలు వస్తే బియ్యం, పసుపు నూరి దాన్ని వాటిపైన పూస్తే తగ్గిపోతాయి.

**24. చెన్నంగి ఆకు :**

దెబ్బలు తగిలినపుడు చెన్నంగి ఆకును నూరి దాని రసాన్ని దెబ్బలు తగిలినచోట పూస్తే దెబ్బలు మానిపోతాయి.

**25. జామాయిల్ (యూకలిప్టస్) ఆకు :**



యూకలిప్టస్ ఆకులను నీళ్ళలో వేసి బాగా మరగబెట్టి తలస్నానం చేస్తే, జలుబు, దగ్గు, రొంపి, తలనొప్పి వంటివి తగ్గుతాయి.

**26. సన్న వాయిలాకు :**

కురుపులు అయితే ఈ ఆకును నలిపి కురుపులపై రాస్తే వెంటనే కురుపులు తగ్గుతాయి.

**27. మందార + గోరింటాకు :**

ఈ రెండు ఆకులను కలిపి నూరి తలకు పెట్టి ఆరగంట అయ్యాక స్నానం చేస్తే చలువగా వుంటుంది. తలలో చుండ్రు కూడా తగ్గుతుంది, వెంట్రుకలు నల్లగా వుంటాయి.

**28. వేపాకు చిగుళ్ళు :**

మధుమేహం (చక్కెర వ్యాధి) వున్నవారు వేపాకు చిగుర్లను రోజూ పరగడుపున తీసుకుంటే మధుమేహం నియంత్రణలో వుంటుంది.

**29. గోరుచుట్టు - నిమ్మకాయ :**

గోరుచుట్టు అయినప్పుడు ఆ వేలికి నిమ్మకాయ గుచ్చాలి. అలాగే వుంచుకుంటే గోరుచుట్టు తగ్గుతుంది.

**30. గాడిదపాలు :**

చిన్న పిల్లలకు నిమ్ము వస్తే గాడిదపాలు తాగిస్తే నిమ్ము తగ్గుతుంది.

**31. చామంతి చెట్టు వేరు :**

చామంతి చెట్టు వేరును ఉడికించి, అందులో వున్న నీటిని గుండెనొప్పి వున్నవారు తాగితే గుండెనొప్పి తగ్గుతుంది. గుండె నొప్పి బాగా ఎక్కువగా వున్నప్పుడు ఈ నీటిని తాగితే కాస్త కుదుట పడుతుంది.

**32. వాము :**

కడుపునొప్పిగాని, దగ్గు, కడుపు మందంగా వున్నప్పుడు వామును తింటే తగ్గుతుంది.

**33. లవంగం :**



పొడిదగ్గు వచ్చినపుడు లవంగాన్ని వేడిచేసి దవడకు వేసి నములుతూ వుంటే దగ్గు తగ్గుతుంది.

**34. అల్లం రసం + తేనె :**

జలుబు చేస్తే అల్లం రసాన్ని తేనెను కలిపి పరగడుపున తీసుకుంటే జలుబు తగ్గుతుంది.

**35. బంతి ఆకు :**

దురదగా వున్నప్పుడు బంతి ఆకును





తీసుకుని దద్దుర్లు ఉన్నచోట రాయాలి. అప్పుడు దురద, దద్దులు రెండూ తగ్గుతాయి.

**36. పారిజాతం పూలు, తులసీ ఆకు :**

ఈ పూలను, తులసి ఆకులను ఉడికించి తాగితే జలుబు వెంటనే తగ్గుతుంది.

**37. ధనియాలు, పసుపు, వాము :**

ధనియాలు ఒక చెంచాడు, పసుపు చిటికెడు, వాము అర చెంచా వేసి బాగా మరగనివ్వాలి. అపుడు మరిగించిన నీటిని త్రాగితే దగ్గు, జలుబు తగ్గుతాయి.

**'పల్లెసృజన' గత రెండు సంచికలనుండి పల్లెల నుండి సేకరించిన సంప్రదాయ జ్ఞానాన్ని ప్రచురిస్తున్నది. ముఖ్యంగా సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినులు శ్రమపడి సేకరించిన జ్ఞానం అపూర్వం. జ్ఞాన సేకరణ చేసిన 'జె. పద్మ,కు జ్ఞానాన్ని పంచిన ఆమె పెద్దలకు మా కృతజ్ఞతలు. - ఎడిటర్.**

# పల్లెసృజన పాఠకులు కూడా ఇన్నోవేటర్లు కావచ్చు!

మీరు చేయవలసిందల్లా ఈ సంచికనుండి మేము ఓ అంశాన్ని మీకు ఇస్తున్నాము
అందుకు సంబంధించి మీకు తెలిసిన, మీ గ్రామంలో ఎవరైనా చేసిన
పద్ధతులను వివరిస్తూ మాకు వ్రాసి పంపండి. మీరు వ్రాసిన దానిని పత్రికలో ముద్రించడంతో పాటు
పంపినందుకు కానుకగా మీకు ఒక సంవత్సరం పాటు

పల్లెసృజన

పత్రికను ఉచితంగా పంపుతాము.

ఈ సంచికలో మీకు ఇస్తున్న అంశం : **'గురక' నివారణకు సాంప్రదాయ మందు. ఉపయోగించిన వారి వివరాలు, ఉపయోగించే పద్ధతులు**

మీ రచనలు పంపవలసిన చిరునామా

ఎడిటర్, పల్లెసృజన, 102, వాయుపురి కాలనీ, సికింద్రాబాద్ - 500 094.



# జపాన్ రైతు ఫ్యుకువోకా వినూత్న వ్యవసాయం

**"దుక్కి చేయడం కాని, మట్టిని తిరగవేయడం తగదు"**
**"రసాయనిక ఎరువులుకాని, కంపోస్టు ఎరువులు కాని వాడకూడదు".**
**"కలుపు తీయవద్దు, కలుపు నివారణకు సేంద్రియ ఎరువులు వాడవద్దు".**
**"రసాయనిక మందులమీద ఆధారపడరాదు".**

"వ్యవసాయం యొక్క అంతిమ ఉద్దేశ్యం పంటలను పెంచటం, పండించటం మాత్రమే కాదు, అది మానవ పరిపూర్ణతకు దారితీయాలి" అన్నది "మసనోబు ఫ్యుకువోకా" అనే మైక్రో బయాలజిస్ట్ ప్రగాఢ విశ్వాసం. ఈయన సహజ సిద్ధమైన వ్యవసాయ విధానాన్ని ప్రపంచానికి అందించాడు. ఈ పద్ధతిలో పొలం దున్నటం కాని, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారణ మందులు వాడకుండా, కలుపు మొక్కలు తీసే అవసరం లేకుండానే పంటలు పండించడం విశేషం.



జపాన్ పశ్చిమ ప్రాంతంలోని షికోకు ద్వీపంలో 'ల్యో' అనే చిన్న పట్టణంలో 'కొమిచి ఫ్యుకుఓకా, సచి ఇషికి దంపతులకు 1913, ఫిబ్రవరి 2వ తేదీన మసనోబు ఫ్యుకుఓకా జన్మించాడు. ఆరుగురి సంతానంలో ఫ్యుకుఓకా రెండవ వాడు. వీరి తండ్రి 'మికాన్స్' అనే ఒక రకమైన పండ్లను పండించేవాడు. ఆ ప్రాంతంలోనే అతనొక గొప్ప వ్యవసాయ దారునిగా పేరుగాంచాడు. ఫ్యుకుఓకా 'ల్యో' పట్టణంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో తన ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. తరువాత మత్సుయామాకు ప్రతిరోజూ నడిచి వెళ్ళి వస్తూ తన మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశాడు. పాఠశాల విద్య తర్వాత ఫ్యుకుఓకా 'గిఫు' వ్యవసాయ కళాశాలలో మైక్రో బయాలజీలో డిగ్రీ పూర్తి చేసి,పై స్పెషలైజేషన్‌తో భూ సాంద్రతల శాస్త్రవేత్తగా పనిచేశాడు.

ఇరవై ఐదు సంవత్సరాల వయస్సులో ఫ్యుకుఓకాకు ఆధునిక వ్యవసాయ శాస్త్ర విజ్ఞానంపై అపనమ్మకం కలగడం మొదలైంది. తీవ్ర నిమోనియా వ్యాధినుండి కోలుకుంటున్న సమయంలో అతనికి జ్ఞానోదయం కలిగింది. మానవ జాతి సాధించినవి ప్రకృతిసామర్థ్యం ముందు అర్థ రహితం అని గ్రహించాడు. ఎన్నో సంవత్సరాలుగా మానవులు ప్రకృతినుండి వేరై, ప్రకృతిని, తమ అధీనంలోకి తీసుని దాన్ని జయించడానికి, తమ జీవితాల్లోని వివిధ సమస్యలను వాటి పరిష్కారాలను అర్థం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలు నిష్ఫలమై, తమ వినాశనానికే దారి తీశాయి అని ఫ్యుకుఓకా అర్థం చేసుకున్నాడు.

ఫ్యుకుఓకా రిసెర్చ్ సైంటిస్ట్ ఉద్యోగానికి రాజీనామా చేసి, స్వంత ఊరికి చేరుకుని, తన కుటుంబ సభ్యులతో 'ఆర్గానిక్ మికాన్స్' పంట పండిస్తూ వ్యవసాయం చేయసాగాడు. అప్పటి నుండి అతను రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిణి మందులు వాడే అవసరం లేకుండా,





సహజసిద్ధమైన ఎరువులు.

పొలాన్ని దున్నడం మానినప్పుడు కలుపు మొక్కల పెంపకం గణనీయంగా తగ్గడం ఫ్యుకుఓకా గమనించాడు. సాగుబడి కలుపు మొక్కల నివారణకు మార్గం కాదు. రసాయనిక మొక్కలు ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసి భూమిని, నీటిని కలుషితం, విషపూరితం చేస్తాయి. కావున కలుపు మొక్కలను పూర్తిగా ఏరివేయడం ఇందుకు పరిష్కారం కాదు. దీనికి బదులుగా కలుపు మొక్కలను నివారించడానికి విత్తనాలు చల్లిన తరువాత పైన ఎండుగడ్డి పరచడం, పంటకు, పంటకు నడుమ జాగ్రత్తగా సకాలంలో విత్తడం మెరుగైన విధానాలు. ఫ్యుకఓకా మూడవ సిద్ధాంతం **"కలుపు తీయవద్దు, కలుపు నివారణకు సేంద్రియ ఎరువులు వాడవద్దు".**

కలుపు మొక్కలు తీసే పని లేకుండా దున్నటం కూడా అవసరం లేని ఒక నవినూత్న సేంద్రియ చిన్నతరహా వ్యవసాయ పద్ధతిని కనుగొన్నాడు. ఈ పద్ధతిలో ప్రయోగాలు చేస్తూ లోపాలు సరిదిద్దుకుంటూ ముందుకు సాగి అతను భూమియొక్క సాత్విక స్వభావాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాడు. "ఇది ఎలా చేయాలి?" అనేదానికన్నా, "ఎలా చేయకూడదు?" అనేదానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చేవాడు. ఎంత ప్రకృతి సహజమైన పర్యావరణాన్ని ఆయన తిరిగి కల్పించాడో అంత ఎక్కువగా భూమాత స్పందించింది.

ఫ్యుకుఓకా సహజసిద్ధమైన వ్యవసాయానికి సంబంధించిన నాలుగు సూత్రాలు : చేయకూడని పనుల లిస్టు తయారు చేయాలి.



భూమి తనంత తానే వ్యవసాయం చేసుకుంటుంది. వేర్లు, పురుగులు, సూక్ష్మజీవులు మానవుడికన్న మిన్నగా వ్యవసాయం చేస్తాయి. భూమిని దున్నటం వలన సహజ సిద్ధమైన పర్యావరణాన్ని మార్చి కలుపు మొక్కలు పెరిగేందుకు అవకాశం కల్పిస్తుంది. కాబట్టి అతని మొదటి సిద్ధాంతం **"దుక్కి చేయడం కాని, మట్టిని తిరగవేయడం తగదు".**

ఇక రెండవది, మానవ ప్రమేయం లేకుండా కుళ్ళిపోయిన చెట్లు, ఆకులు, అలములు, మృత కళేబరాలు, ఇతర వ్యర్థ పదార్థాలు భూసారాన్ని ప్రకృతి సహజంగా పెంపొందిస్తాయి. రసాయనిక ఎరువుల వాడకం పంట పెరగడానికి ఉపయోగ పడుతుందేమో గాని, భూసారాన్ని ఇంకా దిగజారుస్తుంది. కంపోస్టు ఎరువులు, కోళ్ళపెంట కూడా ప్రకృతి పై విధంగా సిద్ధమైన ఎరువులకన్న మిన్న కావు. అంతే కాకుండా కోడిపెంట వేయటం ద్వారా వరి పంటకు "రైస్‌బ్లాస్ట్" అనే తెగులు వస్తుంది. కాబట్టి ఫ్యుకుఓకా రెండవ సిద్ధాంతం **"రసాయనిక ఎరువులుకాని, కంపోస్టు ఎరువులు కాని వాడకూడదు".** దీనికి బదులుగా బిల్ల పెసర, వెంపలి, లవంగం, అల్ఫాల్ఫా లాంటి మొక్కలు



రసాయనిక ఎరువులు, మందులు తెగుళ్ళకు, మొక్కలకు సంబంధించిన వ్యాధులకు, చీడ పీడలకు వ్యతిరేకంగా పనిచేసి తాత్కాలికంగా కొంత ఉపయోగం కల్పించినప్పటికి, దీర్ఘకాలికంగా ఇబ్బందికరమే. అవి చేసే వాతావరణ కాలుష్యాన్ని ప్రక్కన పెట్టినట్లయితే, బలహీనంగా వున్న రసాయనిక ఆధారిత మొక్కలు నిలదొక్కుకోవడానికి మాత్రమే ఉపయోగ పడతాయి. ప్రకృతి బలవంతమైన మొక్కలకే ప్రాధాన్యతనిస్తుంది. ఫ్యుకుఓకా నాల్గవ సిద్ధంతం **"రసాయనిక మందులమీద ఆధారపడరాదు".**

## మనః క్లేశం నుండి మనోనిబ్బరం కోల్పోయేవరకు

# రైతుల కష్టాలకు నిరాశకు స్థిరమైన పరిష్కారాన్వేషణ



**ప్రొ. అనిల్ గుప్త**

వేలకొద్ది రైతులు దేశవ్యాప్తంగా సమకాలీన సంస్థలు, సామాజిక వ్యవస్థలపై అవిశ్వాసాన్ని ప్రకటించడానికి సన్నద్ధమైనపుడు, మన ప్రాధాన్యతలు మరియు విధానాలపై గాఢమైన పునఃపరిశీలన అత్యంత అవసరం. దురదృష్టవశాత్తు ఇంతవరకున్న అనుభవం దీనికి ప్రతికూలంగా వున్నది. సంస్థాపరమైన మార్పులపై దృష్టి మార్చి ప్రభుత్వం ప్రస్తుత పద్ధతుల ద్వారా మరికొంత అభివృద్ధికై కేంద్రీకృతమైనది. బ్యాంకుల నుండి అప్పులు తీసుకొన్న వారికి ఋణప్రదాతలు కొంత ఊరటను అందించవచ్చు. కానీ, ఆత్మ హత్యకు పాల్పడిన చాలామంది రైతులు వాస్తవానికి వడ్డీ వ్యాపారులనుండి అప్పు తీసుకున్న వారే. బ్యాంక్ ఋణదాతలు ఏ విధంగా వారికి ఊరటనందిస్తారు. ప్రత్తి ఇతర పంటల నుండి రావాల్సిన రాబడి పొందలేక పోవడం రైతులకు ఒక పెద్ద ఉపద్రవమనిపిస్తుంది. సంక్లిష్టమైన తెగుళ్ళే ముద్దాలయినాయి. అధిక మోతాదులో పెస్టిసైడ్స్‌ను ఉపయోగించడం (అన్ని రకాల మిశ్రమాలు) తెగుళ్ళ నిరోధక శక్తిని పెంచి పోషించడానికి దారి తీసింది. చాలావరకు ప్రభావితమైన ప్రాంతాలలో బి.టి. ప్రత్తి ఆశించినంత రాబడినవ్వలేదు. రిప్యూజియం లేక బి.టి. కాని ప్రత్తి రకాలు బి.టి. పొలాల చుట్టూ పెరగలేవు. ఇంకా ఎక్కువ ధనం అప్పు చేసి, అవే పెస్టిసైడ్స్‌ను కొని, అదే దురదృష్టాన్ని పొందడానికి రైతులను ప్రోత్సహించడంలో అర్థం లేదు. ఇందులో చాలా విషయాలను పరిశీలించాల్సి వుంది. వేరు వేరు అవకాశాలకు పెట్టుబడులను మారుస్తూ పోవడంలోను, ఒత్తిడిని తట్టుకోవడానికి వివిధ మార్గాలను ప్రయోగించడంలోను సన్నకారు రైతుల సమగ్ర సురక్షా విధానము పరిశుభ్రమించుచున్నది. కానీ ప్రభుత్వ విధానము మరియు సామాజిక సంస్థలు, ప్రయోగాలను సృజనను ప్రోత్సహించకపోతే మార్కెట్‌మీద ప్రభుత్వం మీద అనివార్యంగా ఆధార పడడం రైతులను బాధలకు లోనయ్యే వారిగా మారుస్తుంది. గుజరాత్ అనుభవము పూర్తిగా విరుద్ధమైనది. ఆత్మహత్యలు జరగకపోవడమే గాక గత ఐదు సంవత్సరాలలో రైతులు ప్రతి ఉత్పత్తిలో మూడింతలు అభివృద్ధిని సాధించడం ద్వారా అసాధారణమైన విజయాన్ని పొందారు. బిటి ఉత్పత్తులలో ప్రాంతీయ మూల రకాలను అంటు కట్టడం ద్వారా రైతులు దాదాపు మూడు వందల రకాల ఉత్పత్తులను వృద్ధి చేశారు. బాగా తెలిసిన బిటి జీన్ యొక్క వేరు వేరు పంటలకు సంభవించే తెగుళ్ళపై ప్రభుత్వము సమగ్రమైన పరిశీలన గానీ, మదింపుగానీ చేయలేదన్నది సత్యం. ప్రకృతి సమానత్వాన్ని ఇష్టపడదనేది కూడా వాస్తవం. అదే జీన్స్ పెద్ద కార్పోరేషన్స్‌చేత అమ్మబడే విత్తన రకాలలో పరీక్షించబడి నిర్ధారించబడిన వాటితో సమానము. ప్రభుత్వం నుండిగానీ, మార్కెట్ నుండిగానీ సహాయం లేకుండా రైతులు అంత పెద్ద పరిమాణంలో వ్యవసాయ

భూములలో ప్రయోగముగానీ, భాగస్వామ్య పెంపకం గానీ చేయడం గతంలో చూడలేదు. పరిసరాలలో చెడు ప్రభావాలు కలగవచ్చు. వాటిని పరిశీలించాల్సిన అవసరం వుంది. చాలా ప్రాంతాలలో బాధితులైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సమయంలో దేశంలో ఒకచోట మాత్రం వెనుదరిగకుండా ఎదుర్కొనే ప్రయోగాలు చేసే తత్వం ఎలా రూపుదాల్చింది. ఎంతవరకు ఆత్మహత్యలను ఆపగలిగాము. రైతుల సొంత అన్వేషణ, సృజనాత్మకతలకు సంస్థాగత రక్షణ వ్యవస్థను ఎంతవరకు ఉత్తేజపరచ గలిగాము.

రైతులు ఆత్మహత్యలకు పాల్పడ టానికి చాలా ఇతర కారణాలున్నాయి. స్త్రీల పవిత్రమైన నగలను కుదువపెట్టిన ఋణాలకు సంబంధించిన కుదువ వ్యాపారులనుండి విడుదల చేసుకోలేక పోవడం, ఘోరమైన సంకటానికి కారణమవుతుంది. క్షీణించిన జలసూచిక, సాగునీటి అనిశ్చితి మరియు నీరు పడని బావి నిరాశను తట్టి లేపుతుంది. నాణ్యతలేని విత్తనాలు, కరువు, అకాల వర్షాలు, ఇంకా చాలా కారణాలు వ్యాకులతకు సహకరిస్తున్నాయి. సుమారు వంద సంవత్స రాలకు పూర్వం పంటలు నష్టపోవడం, ఋణాలు తిరిగి చెల్లించలేక పోవడం, మరియు పరిణామంగా ఋణ దాతల వద్ద వెట్టి చాకిరి దక్కన్ ప్రాంతంలో కలహాలకు కారణమైంది. దేశంలో కరువుకు బాధిత మయ్యే చాలా ప్రాంతాలలో గొప్పగా మార్పేమీ రాలేదు. భూ సంస్కరణలుగానీ, జల సంస్కరణలుగానీ బుద్ధి పూర్వకముగా సాధించుటకు యత్నించలేదు. (ప్రత్యేకంగా భూ జలానికి సంబంధించి).



ఇంజనీరింగ్ కళాశాలలోగానీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులలో గానీ పిల్లలను చేర్చుటకు కొన్ని సందర్భాలలో వారు బ్యాంక్ ఋణాలు పొందలేక తల్లిదండ్రులు అధిక వడ్డీలతో అప్పులు తీసుకోవలసి రావడం దౌర్జన్యకరమైన పరిసరాలకు దారి తీస్తున్నది. ఇంకా చాలా సామాజిక కారణాలు ఒత్తిడిని కల్పిస్తాయి. కష్టాన్ని పెంచుతాయి, నిరాశను మేల్కొలుపుతాయి. కష్టాలను తట్టుకొనుటకు రైతులు అనుసరించే విధానాలను పుష్టి చేయుటకు, రైతుల అవకాశాలను బహుము ఖం చేసుకోవటానికి కుటుంబం లోపల, ఇతర కుటుంబాల మధ్య, వర్గ స్థాయిలోను, మరియు ప్రభుత్వ కష్ట నివారణ విధానాలను వివిధ విభాగాలుగా చేసుకోవాల్సి వుంది. వ్యక్తిగత స్థాయిలోగానీ, వర్గాల స్థాయిలోగానీ, ఈ తట్టుకొనే విధానాలలోని బలాబలాలను సరి చేయుటకు దేశ స్థాయిలో ఏ విధమైన ప్రయత్నమూ లేదు.

సంకటాలను ముందే ఊహించు టకు మరియు తట్టుకొనే విధానాలను పుష్టి చేయుటకు చాలా మార్గాలున్నాయి. ఇలాంటి సమస్య లను ఇతర వ్యక్తులు గానీ, వర్గాలుగానీ ఎలా సమర్థవంతం గా నిర్వహించారు అనే సమాచారం మరియు విజ్ఞానాన్ని పొందడమే మార్పు కు ఎంతో ముఖ్య మైన సాధనాలలో ఒకటి. ఆ విధమైన సమాచారాన్ని ఎలా పొందడము. ఆ విధమైన విధానాలకు సంబంధించిన సమా చార గిడ్డంగి ఎక్కడ వుంది. ఈ మూలాలతో కూడిన నూతన యత్నా లు, నవ్యమార్గాలు, మరియు సంస్థాగత ఏర్పాట్లను ఎవరు భద్రపరుస్తున్నారు. ఒకచోటనుండి మరొక చోటికి ఈ పాఠ్యాంశాలను ఎలా అందజేస్తారు?

గ్రామీణ అభివృద్ధిని, సార్వభౌమాధి కారాన్ని సాధించటానికి మధ్యవర్తిత్వం చేయడం గురించి ఒకప్పుడు గాంధీజీ కొంతమంది యువకులకు ఏమి బోధించాలో గుర్తు చేసుకొందాం. కొంతమంది యువకులు గాంధీజీని సమీపించి గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధికై మధ్యవర్తిత్వం ఆరంభించటమెలాగ అని సలహా కోరారు. గాంధీజీ అంతకు మునుపెన్నడు గ్రామీణ ప్రాంతాలలో తను పని చేయనందుకు పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేశారు. ఆయువకులు గాంధీజీని వదల లేదు. వారు గాంధీజీని సలహా ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేశారు. "మీరు ఏం చేయాలి అనేది నాకు తెలియదు. ఒక పల్లెటూరులో ప్రాంతీయ పరిస్థితులను అభివృద్ధి చేయుటకు నేను పని చేస్తే నేనేమి చేస్తానో చెప్పనివ్వండి" అని అన్నారు. మనము పని చేయాలనుకొన్న ఒకానొక విభాగాన్ని ఎన్నుకొందాము. ఉదాహరణకు, జంతు సేద్యము తీసుకుం దాం. గ్రామములో జంతు సేద్యములో బాగా ఉత్పత్తి సాధించిన వారిని, ఇతరులకంటే జంతువుల ఆరోగ్యాన్ని బాగా చూసుకొన్న వారిని మొదట గుర్తించాలి. అలా గుర్తించిన తరువాత వారు జంతు సేద్యానికి సంబంధించి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే విధి విధానాలను, పెట్టుబడులను, మరియు ఇతర కార్యక్రమాలను వ్రాసి వుంచాలి. తరువాత సగటు ఉత్పత్తి సాధించిన రైతుల వివరాలను కూడా అదేవిధంగా వ్రాసుకోవాలి. ఈ రెండింటి మధ్య ఉన్న విధి విధానాలలోని తేడాను పూరించడమే తనపని అని గాంధీజీ వాదించారు. ఈ లోతైన సలహాలో ఎంతో సరళత దాగివుంది. నేడు దీనినే మనము అత్యున్నతమైన ప్రయోగాత్మక విశ్లేషణ అంటారు. ఉత్తమమైన మరియు సగటు విధానాలకు మధ్య ఉన్న తేడా –

విజ్ఞానము, సమాచారము మరియు -నేర్పులలో ఉన్న అనమానతను అధిగమించటానికి ఒక దృఢమైన అవకాశాన్ని సమకూరుస్తుంది.

కష్టాలను విజయవంతంగా ఎదుర్కొనగలిగిన రైతులనుండి నేర్చుకొన్న విజ్ఞానము, సృజనాత్మకత, మరియు వారిచే సాధ్యమై నూతన ఉత్పత్తులను, అదే రకమైన సవాళ్ళతో ఇబ్బంది పడుతున్న వారికి అందించడం ఒక పరిష్కార మార్గాన్ని సూచిస్తుంది. దేశమంతటినీ జోడించే గ్రామీణ విజ్ఞాన నిర్వహణ సంస్థ, ప్రాంతాలకు అనుగుణంగా ఎదుర్కొనగలిగే విధి విధానాలను పుష్టి చేయుటకు ఒక సంస్థాగతమైన మంచెను అందిస్తుంది. రైతులు వారి అవసరాలకు అనుగుణంగా ఆ విధానాలను మార్చగలరు. ఉదాహరణకు ప్రత్తి పంటకు చుట్టూ బెండను పెంచడం ద్వారా తెగుళ్ళను నిరోధించడం సహాయపడగలదు. ఏ కార్పొరేట్ యంత్రాంగంగానీ, లేక ప్రభుత్వ యంత్రాంగం గానీ, ఈ విధమైన పద్ధతులను వ్యాపింపజేయడంలో ఇష్టం కనబరచుట లేదనిపిస్తుంది. కానీ, రైతులకు ఇది తెలియదు. వారికి దీని గురించి తెలుసు కొనుటకు ప్రోత్సాహకాలు ఉండి ఉండవచ్చు. ఒకప్పుడు కచ్‌లో ఒక శోధయాత్ర (నేర్చుకో నడక - జ్ఞాన నడత) జరుగుతున్నపుడు తెగుళ్ళను రసాయనిక ఎరువుల ఉపయోగం లేకుండా నియంత్రించడం గురించి మా విన్నపము విని ఒక రైతు తన అవగాహనను ఇలా క్లుప్తంగా తెలిపారు.

జంతువులచే తినబడినటువంటి అన్ని మొక్కలు, మొక్కల తెగుళ్ళ నిరోధకాలకు శక్తివంతమైన వనరులుగా ఉపయోగించ గలిగాము. సరళమైన, స్వయం శోధితమైన, మరియు సార్వత్రికమైన ప్రయోగము ఈ విధమైన సరళమైన నియమాల నుండి చాలా సంక్లిష్టమైన విషయాలను కూడా విస్తారముగా ఎందుకు పంచుకో కూడదు.

# ఏరియల్ రోప్‌వే (గాలిత్రాళ్ళ త్రోవ)

# కల్లుగీత కార్మికులకు ఎంతో ఉపయోగకరం!

**- వేముల ప్రభాకర్ గౌడ్**

ఈ గాలిత్రాళ్ళ పద్ధతి (ఏరియల్ రోప్ వే) పద్ధతి కొబ్బరి చెట్లు ఎక్కి కాయలు దించే వారిని దృష్టిలో పెట్టుకొని రూపొందించబడింది. కొబ్బరి తోటల్లో చెట్లు దగ్గర దగ్గరగా వుంటాయి. ఒక చెట్టు ఎక్కిన పనివాడు కాయలు దింపిన తర్వాత ఆ చెట్టు దిగి మరో చెట్టు ఎక్కాల్సిన అవసరం లేకుండా నేరుగా ఆ





చెట్టుపై నుండే మరో చెట్టు, అటునుండి ఇంకో చెట్టు ఇలా ఎన్ని చెట్లపైకైనా వెళ్ళి తన పని పూర్తి చేసుకుని దిగవచ్చు. అయితే ఈ చెట్లన్నీ ఏరియల్ రోప్‌వేతో అనగా గాలి త్రాళ్ళ దారితో కలిపి వుండాలి.

దగ్గర దగ్గరా వున్న చెట్లను కలుపుతూ రెండు తాళ్ళు కడతారు. ఒక త్రాడు క్రింద నడవటానికి, మరొక త్రాడు పైన చేతులతో పట్టుకోవడానికి వీలుగా వుంటుంది. రెండు త్రాళ్ళకు మధ్య నిలువెత్తు దూరం వుంటుంది. చెట్టు మొగి భాగాలను కలుపుతూ ఒక త్రాడు కడితే దానికి దాదాపు రెండు గజాల క్రింద మరో త్రాడు బిగిస్తారు. కార్మికుడు ఈ త్రాళ్ళ సహాయంతో క్రింది తాడుమీద నడుస్తూ పై త్రాడు చేతులతో పట్టుకుని సులభంగా ఒక చెట్టుమీదనుండి మరో చెట్టుమీదకు వెళ్ళిపోవచ్చు. ఈ పద్ధతిలో కల్లుగీత కార్మికులు కూడా చెట్టుపైకి వెళ్ళవచ్చు. కాకపోతే తాటి చెట్లు దగ్గర దగ్గరగా 'రోప్‌వే'కు అనుకూలంగా ఉండాలి.

ప్రతియేటా తాటికల్లు తీసే కార్మికులు చెట్టుపై నుండి పడి చనిపోతున్న సంఘటనలు చాలా జరుగుతున్నాయి. 70 నుండి 80 ఫీట్లున్న తాటి చెట్టునుండి కార్మికుడు ప్రమాద వశాత్తు క్రిందపడితే బ్రతికే అవకాశం చాలా తక్కువ. చెట్టుపై నుండి పడ్డవారిలో నూటికి 44 శాతం మంది గీత కార్మికులకు వెన్నెముక దెబ్బ తినడం, 18 శాతం మందికి తలకు, 14% మందికి ఛాతీభాగం దెబ్బ తినడం జరుగుతోందని ఒక పరిశోధన ప్రకారం తెలిసిన లెక్కలివి.

కాబట్టి నిరుపేద కల్లుగీత కార్మికుల వృత్తిని ప్రమాద రహితం చేయడానికి వారి వృత్తి పరికరాలను శాస్త్రీయ పద్ధతుల్లో మార్పు చేర్పులతో అభివృద్ధి చేయడం అవసరం. ఇందుకు పల్లెసృజన వేదికను పరిశోధకులు వాడుకోవాలని కోరుతున్నాను.

# పూసర్ల ఆలోచనకు రూపం వస్తే.....



## కాలి చెప్పులపై వత్తిడి వలన విద్యుత్ తీయవచ్చు

కాలి చెప్పులోగాని, బూటులోగాని ఒక యంత్రాన్ని అమర్చవలెను. ఇది పైనుండి (మన కాలు వత్తిడి వలన) వచ్చిన వత్తిడిని విద్యుత్‌గా మార్చి చార్జరులో నిక్షిప్తం చేసుకోవచ్చు. తరువాత ఈ విద్యుత్‌ను సెల్ ఫోన్‌కిగాని, లేదా చిన్న చిన్న విద్యుత్ పరికరాలకు గాని వాడుకోవచ్చు.

ఒక జత చెప్పులతో ఒక వ్యక్తి రోజుకి ఒక గంట వేగంగా నడిస్తే ఒక వాట్ కన్నా ఎక్కువ విద్యుత్ తీయవచ్చు. ఇలా ప్రపంచంలో 700 కోట్ల మందిలో కనీసం 500 కోట్ల మంది ఈ చెప్పులు వాడి ఒక గంట నడిస్తే 500 కోట్ల వాట్‌ల విద్యుత్‌ను ఒక గంటలో పొందవచ్చు. ఇలా ఎన్నిగంటలు నడిస్తే అన్ని వాట్‌ల విద్యుత్‌ను పొందవచ్చు. ఈ మానవ ఇంధనం తరగనిది. మనలో వుంది. ఎంతకావాలంటే అంత పొందవచ్చు. రానున్న 1000 సంవత్సరాలలో సహజ వనరులు పూర్తిగా అయిపోతాయి. పెట్రోలు, బొగ్గు, అణు (యురేనియం) వనరులు వుండవు. అప్పుడు గాలిమరలు, సూర్యరశ్మితో తీసే విద్యుత్‌లపైనే ఆధారపడక తప్పదు. ఇవి మన చేతుల్లో లేవు. ఎప్పుడు గాలి వీస్తుందో తెలియదు. కావున ఇటువంటి యంత్రాల వలన విద్యుత్‌ను సులువుగా పొందవచ్చు.

మనం వద్దు అనుకున్నా ప్రతిరోజూ తెలిసో, తెలియకో కొన్ని గంటలు నడుస్తాం. ఈ కండర శక్తి (వత్తిడి)తో విద్యుత్‌ను పొందడం ఉత్తమం. అయితే చెప్పులు తేలిగ్గా వుండాలి. ఎక్కువ కాలం మన్నేవిగా వుండాలి. నీరు, ధూళి, బురద వలన ఈ యంత్రం చెడకుండా నాణ్యతగా తయారు చేయాలి. క్రింద రబ్బరు పొర వాడవచ్చు. ఇలాంటి చెప్పులను ప్రతి ఒక్కరూ విధిగా వాడి కొంతదూరం నడిస్తే ఇటు విద్యుత్, అటు ఆరోగ్యం రెండు పనులు అవుతాయి.

## పెన్ సెల్

ఈ పెన్ సెల్ కేవలం రిసీవింగ్‌కు మాత్రమే ఉపయోగపడుతుంది. మనకు వచ్చే ఫోన్ కాల్స్‌ని ఒక క్లిక్ ద్వారా వినవచ్చు. మరల క్లిక్ చేయడం ద్వారా కాల్ కట్ అవుతుంది. పెన్ను పై భాగంలో వచ్చిన కాల్‌ని వినవచ్చు. పెన్ క్రింద భాగం దగ్గర మన మాటలు వారికి వినిపించేలా మైక్రోఫోన్‌ను వుంచవచ్చు. ఇటువంటి పెన్ సెల్‌ను కేవలం రూ. 250/-ల విలువలో మనం తయారు చేయవచ్చు. ప్రపంచంలో కనీసం 300 కోట్ల మంది రానున్న కాలంలో వాడతారు. దీనికి కెమెరా, టార్చిలైట్‌లు కూడా అమర్చవచ్చు. ఇంత తక్కువ పరిమాణంలో ఒక పెన్ వలె వున్న కేవలం రిసీవింగ్‌కి ఉపయోగపడే పెన్ సెల్ తయారు చేస్తే బాగుంటుంది. ●




ముచ్చటగా మూడో వసంతంలోకి అడుగిడిన

పల్లెసృజన

పాత సంచికలు కావాలా?



కావలసిన వారు డి.డి. లేదా మనియార్డరుతో ఎడిటర్‌ను సంప్రదించండి.

ఒక్కో సంచిక రూ. 15/-లు మాత్రమే

# అహమ్మదాబాద్ వర్క్‌షాప్ అనుభవాలు



– జె. కిషన్ పవార్, సంగారెడ్డి.

సెప్టెంబర్ 3–5 తేదీలలో అహమ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి హనీబీ వాలంటీర్స్ యస్. & డి. వర్క్‌షాప్‌లో పాల్గొనుటకుగాను హనీబీఏపి చీఫ్ కో–ఆర్డినేటర్ శ్రీ పి. గణేశం సార్ గారి ఆదేశం మేరకు శ్రీనివాస్ మరియు నేను ప్రయాణానికి సిద్ధమయ్యాము. సెప్టెంబర్ 1న మధ్యాహ్నం 3 గంటలకు రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్‌లో అహ్మదాబాద్‌కి బయలుదేరాము. గణేశం సార్ మాకు తగు జాగ్రత్తలు, సూచనలు అందజేశారు. ట్రెయిన్ బయలుదేరడంతో మేం కబుర్లలో పడ్డాం. శ్రీనివాస్ స్వగ్రామం భూంపల్లి (సిద్ధిపేట దగ్గర) ఈమధ్యే యం.బి.ఏ. పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. అరకులో జరిగిన శోధయాత్రలో చురుకుగా పాల్గొన్నాడు. ఇలా కాసేపు ఒకరి గురించి మరొకరం తెలుసుకున్నాము. మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటలకల్లా అహ్మదాబాద్ చేరుకున్నాము. అన్ని రాష్ట్రాల నుండి విచ్చేసిన స్కౌట్లు అందరికీ 'సృష్టి' కార్యాలయంలోనే బస ఏర్పాటు చేశారు.

3వ తేదీ ఉదయం 'సృష్టి' ఆవరణలోనే వర్క్‌షాప్ ప్రారంభమైంది. యన్.ఐ.ఎఫ్. వ్యవస్థాపకులు ప్రొఫెసర్ అనిల్‌గుప్తా గారు, డా. టి.ఎన్. ప్రకాష్ గారు, స్కౌట్‌లను ఉద్దేశించి ప్రారంభోపన్యాసం చేశారు. ఇట్టి సమావేశంలో హనీబీఏపి సారథులు శ్రీ గణేశం గారు, శ్రీ చంద్రకాంత్ శర్మ గారు, అలాగే వివిధ రాష్ట్రాల కొలాబొరేటర్లు, చీఫ్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు. టెక్నాలజీ ఆఫీసర్ శ్రీ విపిన్ గారు వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ్యాలను వివరిస్తూ దేశం నలుమూలల నుండి వచ్చిన స్కౌట్‌లను పరిచయం చేశారు. డా. విపిన్ గారు యన్.ఐ.ఎఫ్. నిర్మాణం మరియు అందులోని విభాగాలు నిర్వర్తించే విధుల గురించి అవగాహన కలిగించారు.

యన్ఐయఫ్. ద్వారా దేశవ్యాప్తంగా సేకరించిన జ్ఞానాన్ని వ్యాలిడేషన్ చేయుటకుగాను సి.యస్.ఐ.ఆర్. రూ. 5 కోట్లు కేటాయించిందని తెలిపారు. అయితే స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ ప్రక్రియలపై స్కౌట్‌లకు సరియైన అవగాహన లేకపోవటంతో నవోదయ్యే ఎంట్రీలలో సమాచారం అసమగ్రంగా ఉండటం వలన వాటిని వ్యాలిడేట్ చేయుటలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇట్టి కారణంగానే స్కౌట్‌లకు అవగాహన కలిగించుటకు వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపినారు. అనంతరం శ్రీ గుప్తాగారు స్కౌట్లు వెలిబుచ్చిన సందేహాలకు సమాధానాలు ఇవ్వడం జరిగింది. తదుపరి స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ ప్రక్రియలపై అవగాహన మరియు చర్చా కార్యక్రమాన్ని స్లైడ్ ప్రజెంటేషన్ సహాయంతో యస్. & డి. టీమ్ మెంబర్లు శ్రీ వివేక్ మరియు నితిన్ గార్లు నిర్వహించారు. స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ అంటే ఏమిటి? ఎందుకు చేయాలి? ఎలా చేయాలి? మొదలైన విషయాలన్నీ చక్కగా వివరించారు. వ్యవస్థీకృత రూపంలో జ్ఞానాన్ని ప్రోగు చేయడమే స్కౌటింగ్ అన్నారు. 1. వస్తువు (మెటీరియల్), 2 ప్రక్రియ (ప్రాసెస్), 3. ఉపయోగం (యూజ్ / అప్లికేషన్) లలో నవ్యత వుంటే దానిని ఇన్నోవేషన్‌గా భావించి స్కౌటింగ్ చెయ్యాలన్నారు.

భోజన విరామానంతరం యస్. & డి శిక్షణా కార్యక్రమం కొనసాగింది. తదుపరి స్కౌట్లు, కొలాబొరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు ప్రైమరీ, సెకండరీ డాక్యుమెంటేషన్ కొరకు నెట్ వర్క్ మెంబర్లకు కావలసిన కనీస అవసరాలు గురించి చర్చించడమైనది. కొలాబొరేటర్లు స్కౌట్‌ల అభిప్రాయాలను స్వీకరించడం జరిగింది. టీ బ్రేక్ తర్వాత స్కౌట్‌లను గ్రూపులుగా విభజించి వారికి ఈ క్రింది అంశాలను ఇచ్చి ప్రజెంటేషన్ ఇవ్వవలసిందిగా కోరారు. 1. నెట్‌వర్క్‌ను బలోపేతం చేయుటకు అనుసరించదగు వ్యూహాలు, 2. డాక్యుమెంటేషన్‌లో గుణాత్మకత, 3. పి.ఐ.సి. మరియు దాని అనువర్తనాలు, 4. నెట్‌వర్క్ వ్యాప్తి కొరకై వ్యూహాలు, 5. స్కౌటింగ్ వ్యూహాలు.

సెప్టెంబర్ 4న రెండవ రోజు శిక్షణా కార్యక్రమము ఉదయం 9–30 గం.లకు ప్రారంభమైనది. మొదటగా హెర్బేరియమ్ ప్రిపరేషన్‌పై శ్రీ వివేక్ గారు శిక్షణనిచ్చారు. హెర్బేరియమ్ తయారీ కొరకు మొక్కలను సేకరించే విధానము, నమూనాలను నిర్జలీకరణం చేయడం మరియు హెర్బేరియం షీట్స్‌పై అతికించడంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెప్పారు. తర్వాత ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారు శిక్షణకు హాజరయిన స్కౌట్‌లతో ప్రశ్నోత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్కౌట్లు అందరూ పాల్గొనేలా ప్రేరేపించారు. ఒక స్కౌట్ అడిగిన ప్రశ్నకు శ్రీ అనిల్ గుప్తాగారు సమాధానమిస్తూ స్కౌటింగ్‌లో ప్రతిభ కనబర్చిన వారికి ఎన్.ఐ.ఎఫ్. ఉద్యోగులుగా పనిచేసే అవకాశాన్ని కల్పించగలమని తెలిపారు. ముందురోజు ఏర్పాటు చేసిన గ్రూపులు తమకు కేటాయించిన అంశాలపై తమతమ ప్రజెంటేషన్లు ఇవ్వడం జరిగింది.

మధ్యాహ్నం భోజన విరామా

నంతరం శ్రీ జనమేజయ్‌జీ గారు ఫొటోగ్రఫీకి సంబంధించిన కొన్ని మెళకువలను చెప్పారు. ఫొటో తీసే సమయంలో ఫ్లాష్‌ను తప్పకుండా ఉపయోగించాలని చెప్పారు. తర్వాత శ్రీ నితిన్ మరియు వివేక్ గార్లు పి.ఐ.సి. (ప్రియర్ ఇన్ఫర్‌మేషన్ కాన్‌సెంట్)పై వివరణాత్మక స్లైడ్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

మరుసటిరోజు అనగా 5వ తేదీ ఉదయం 8 గం.లకు అందరం బస్‌లో క్షేత్ర పర్యటనకు బయలుదేరాము. ముందుగా 'అంబోడ్' అనే గ్రామంలో 'నట్టూభాయ్' అనే మూలికా వైద్యున్ని కలుసుకోబోతున్నట్లు పర్యటనకు నేతృత్వం వహించిన 'రమేష్ భాయ్' తెలిపారు. ఇంతలో 'అంబోడ్' గ్రామం రానే వచ్చింది. రోడ్డు పక్కనే ఓ చిన్న హోటల్ ఈ హోటల్‌ను 'నట్టూభాయ్' తన సోదరులు, కుమారుల సహాయంతో నిర్వహిస్తున్నారు. అలాగే తన వద్దకు వచ్చే రోగులకు ఉచితంగానే మూలికా వైద్యం చేస్తారు. తాను డయాబెటిస్, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్, భగందరము, అర్శమొలలు, కామెర్లు మొదలగు వాటికి చికిత్స చేస్తానని నట్టూభాయ్ (పూర్తిపేరు నట్వర్‌సింగ్ మాన్‌సింగ్ చావ్డా) తెలిపారు. ఈయన వద్ద చికిత్స పొందడానికి ముంబాయి పరిసర ప్రాంతాల నుండి కూడా రోగులు రావడం విశేషం. అలాగే అప్పుడప్పుడు వైద్య సంబంధ క్యాంపులు కూడా నిర్వహిస్తాడు. ఒక ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ అధిపతికి కూడా ఇతను చికిత్స చేసినట్లు 'రమేష్ భాయ్' తెలిపారు. వివరాలు అడిగితే తెలపడానికి నట్టూభాయ్ గారు వినమ్రంగా తిరస్కరించారు. ఈయనకు స్వయంగా బ్లడ్ క్యాన్సర్ ఉండేదట. డాక్టర్లు పరీక్షించి ఎక్కువ కాలం బ్రతకడం కష్టమని తేల్చారట. తానే స్వయంగా చికిత్స చేసుకొని 'బ్లడ్ క్యాన్సర్' తగ్గించుకొన్నానని తెలిపారు. మనిషిని చూడగానే అతనిలోని ఆరోగ్యపరమైన సమస్యలను చెప్పేయగలగడం ఈయన ప్రత్యేకత. ఈ సందర్భంగా నట్టూభాయ్ గారిని ఎన్.ఐ.ఎఫ్. ప్రత్యేకంగా సన్మానించింది. తనను కలవాలనుకునేవారు ఒక్క ఆదివారం మినహా ఎప్పుడైనా రావచ్చన్నారు. 'అంబోడ్' గ్రామం అహ్మదాబాద్ నుండి సుమారు 55 కి.మీ. దూరంలో గాంధీనగర్‌కి దగ్గరలో వుంది. అతి సామాన్యంగా కనిపించే ఒక అసాధారణ వ్యక్తిని కలుసుకున్నామన్న సంతోషంతో అక్కడినుండి బయలుదేరాము.

మా తర్వాతి గమ్యం 'అమరాపూర్'. అక్కడికి చేరుకున్న తర్వాత శ్రీ వివేక్ గారు ఒక్కొక్కరిని 5 రకాల మొక్కలు సేకరించుకొని రమ్మని పురమాయించారు. సేకరణ తర్వాత అట్టి మొక్కల నమూనాలను జాగ్రత్తగా


'నట్టూభాయ్'

భద్రపరిచారు. మా తదుపరి మజిలీ 'గ్రామ భారతి డీమ్డ్ యూనివర్శిటీ'. యూనివర్సిటీ ప్రాంగణమంతా హరిత శోభతో అలరారుతోంది. ముందుగా ఛైర్మన్ శ్రీ 'ఈశ్వర్ భాయ్' గారిని కలిశాము. మానవత్వం, కరుణ మూర్తీభవించినట్లు ఆయన కనిపించారు. మమ్మల్ని ఉద్దేశించి మాట్లాడుతూ 'గ్రామభారతి'ని 1958లో ఎన్నో కష్ట నష్టాలకోర్చి స్థాపించినట్లు తెలిపారు. 'గ్రామభారతి' విద్యా వ్యవస్థలో అనేక కొత్త ప్రయోగాలు చేసింది. పేద విద్యార్థులు శని, ఆదివారాలలో ఇక్కడ పనిచేసి ఆదాయాన్ని ఆర్జిస్తారు (వర్క్ & స్టడీ). ప్రాథమిక స్థాయి నుండి కళాశాల స్థాయి వరకు ఇక్కడ విద్యాబోధన జరుగుతుంది. సుమారు 1100 మంది విద్యార్థులున్నారు. మూడు సంవత్సరాల వ్యవధిగల 'గ్రామవిద్యా విశారద్' (డిగ్రీ స్థాయి) కోర్సులో 32 అంశాలను గుజరాతీ మాధ్యమంలో బోధిస్తారు. ప్రతి విద్యార్థి సంవత్సరానికి 250 గంటలు వ్యవసాయానికి సంబంధించిన పనులు నేర్చుకుంటారు.

'ఈశ్వర్ భాయ్' గారి దగ్గర సెలవు తీసుకుని అక్కడికి సమీపంలోనే వున్న హెర్బల్ పెస్టిసైడ్స్ తయారీ ప్లాంటును సందర్శించాము. 'సృష్టి' ఆధ్వర్యంలో ఇక్కడ హెర్బల్ ఉత్పత్తులను తయారు చేస్తారు. అక్కడినుండి నేరుగా శాటిలైట్ కాంప్లెక్స్ లోని ఎన్.ఐ.ఎఫ్. కార్యాలయానికి వెళ్ళాం. కార్యాలయంలోని అన్ని డిపార్ట్‌మెంట్‌లను సందర్శించి తిరిగి 'సృష్టి' కి చేరుకున్నాము. భోజనానంతరము మొత్తం శిక్షణా కార్యక్రమంపై సింహావలోకనం జరిగింది. తదుపరి డాక్టర్ టి.ఎన్. ప్రకాష్, డాక్టర్ విపిన్, రమేష్ భాయ్ గారల వందన సమర్పణతో 3 రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసినది. మరుసటి రోజు ఉదయం నేను, శ్రీనివాస్ కాకినాడ ఎక్స్‌ప్రెస్‌లో భాగ్యనగరానికి తిరుగు ప్రయాణమయ్యాము.

•

శ్రీ కిషన పవార్ హనీబీఎపి వాలంటీర్. ఉపాధ్యాయ వృత్తిలో తీరిక లేకున్నా గ్రామాలకు వెళ్ళి స్వచ్ఛందంగా జ్ఞాన సమీకరణ తరచుగా చేస్తున్నారు. - ఎడిటర్

Centre Spread

Centre Spread



# 'అన్వేషణ' కు దిశా నిర్ణయం అవసరమా?

ఒక రైతు నసీరుద్దీన్‌ను "ఈ సంవత్సరం మీ విప్పచెట్ల సాగు చక్కని ఫలసాయం ఇస్తుందా?" అని అడుగుతాడు.

అందుకు నసీరుద్దీన్ "తప్పకుండా చక్కని ఫలసాయం ఇస్తుంది" అంటాడు.

"మీకెలా తెలుసు?" అని తిరిగి రైతు ప్రశ్నిస్తే

"నాకు తెలుసు అంతే" అంటాడు నసీరుద్దీన్.

తరువాత కొంత కాలానికి అదే రైతు సముద్రం ఒడ్డున ఒక గాడిదను వెంటబెట్టుకుని వడివడిగా అంగలు వేస్తూ సముద్రంలో నుండి ఒడ్డుకు కొట్టుక వచ్చే కలప కోసం వెదుకుతున్న నసీరుద్దీన్‌ను చూస్తాడు.

"ఇక్కడ ఎలాంటి కలప దొరకదు ముల్లా నేను కూడా చూశాను" అంటాడు రైతు.

తరువాత కొంత సమయానికి ఎలాంటి కలప లేకుండానే ఇంటిదారి పట్టిన నసీరుద్దీన్‌ను చూస్తాడు.

"మీకు గ్రహణశక్తి ఎక్కువ కదా! ఈ సంవత్సరం విప్పచెట్లు చక్కని ఫలసాయం ఇస్తాయని ఊహించగల్గారు. కాని, సముద్రం ఒడ్డున కలప దొరకదు అనేది ఊహించ లేకపోయారా?" అంటాడు రైతు నసీరుద్దీన్‌తో.

"జరగాల్సింది చెప్పగలను, జరగబోయేది ఎలా చెప్పగలను".

సముద్ర తీరంలో తాను కర్రకోసం వెతికిన ప్రయోగంపై ముల్లానసీరుద్దీన్ గాఢమైన అర్థాన్ని తన మాటల్లో కుదించాడు.

పై చిత్రం ఎంతో చక్కగా మన ముందున్న అవకాశాల గురించి వివరిస్తుంది. మనకు గమ్యం తెలియదు కాబట్టి ప్రయాణం అర్థవంతమౌతుంది. ఒకవేళ మనకు తెలిసినా 'సముద్రంలో తుఫాను పడవపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందో', 'హెర్బల్ మందులు ఎలా పని చేస్తాయో', 'నిజ జీవితంలో సవాళ్ళు ఎలా ప్రభావితం చేస్తాయో' వీటి గురించి మనకు కొంచెం మాత్రమే తెలుసు. కానీ, మన ప్రయత్నం సాగుతూనే వుంటుంది.

అనిర్దిష్టమైన పరిష్కారాలు వెతకడంలో వున్న సాహస పూరితమైన అనుభవం, అనిర్వచనీయమైన ఆనందం, నిర్దిష్ట పరిష్కారాలలో ఎందుకు లేదు?

ఇన్నోవేటర్లను కారణాలు లేని (తర్కరహిత) పరిష్కారాలు వెతకడం కోసం ఏ శక్తి ప్రోత్సహిస్తుందో!

# ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు

### పశువులలో 'మాయ' పడిపోవటానికి మహుడా పండ్లు మరియు బెల్లం.

బలవర్ధకమైన ఆహారం లేకపోవడం వల్ల గర్భాశయ వ్యాధులు రావటం, పశువులు ఈనిన తర్వాత సుమారు 6 నుండి 8 గంటల వరకు కూడా 'మాయ' పడక పోవటం జరుగుతుంటుంది. ఈ మాయ పడటం ఎక్కువ కాలం పట్టినట్లయితే గర్భాశయంలో




కుళ్ళిపోయే ప్రమాదముంది. ఇది అనేక వ్యాధులకు కూడా కారణమౌతుంది. ఈ పరిస్థితులలో రైతులు సమస్య మరింత జఠిలం కాకుండా ఉండేందుకు ఒక పద్ధతుంది. కుంబాభి, మహుద పండ్లు, బెల్లం ఉపయోగించి దీని నివారణ సూచించారు.

400 గ్రా. మహుద పండ్లు, 250 గ్రా. బెల్లం కలిపి పశువులకు ఈనిన తర్వాత తినిపించేవాడు. 2 లేదా 3 గంటల్లో మాయ పడిపోతుంది. ఇది తన పూర్వీకుల నుండి నేర్చుకున్నారు. ఇరుగు పొరుగు చాలామంది దీనిని ఉపయోగించేవారు. ప్రత్యేకించి తీసుకోవలసిన జాగ్రత్త ఏమిటంటే మహుదా పండ్లు 400 గ్రా. కంటే ఎక్కువ వాడరాదు. ఒకవేళ అలా వాడినట్లయితే పశువులు స్పృహ కోల్పోయే అవకాశం వుంది.

### పశువులలో నులి పురుగుల నివారణ

ప్రేవులలో నులి పురుగులు సాధారణంగా లేగ దూడలకు వ్యాధిని కలుగజేస్తాయి. ఈ వ్యాధి సోకిన దూడలనుండి నులి పురుగులు, ఇతర పశువులకు సోకుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులు బలహీనంగా, ఆందోళనగా



కన్పిస్తాయి. శరీరంపై వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి. కళ్ళు తెల్లగా పేలవంగా మారుతాయి. దూడలలో ఎదుగుదల తగ్గిపోతుంది.

కిరణ్ భాయ్ మంగళ్ భాయ్ గోహిల్ సలహా ప్రకారం 10 గ్రా. నల్ల మిరియాలు పొడి చేసి, 250 గ్రా. ఆముదంలో ఉడికించి, చల్లారిన తర్వాత వ్యాధి సోకిన పశువులకు ఈ మిశ్రమాన్ని ఇచ్చినట్లయితే నులి పురుగులు చనిపోతాయి. చనిపోయిన పురుగులు మల మూత్రాల ద్వారా విసర్జించబడతాయి.

కేవలం రెండు రోజులపాటు ఈ మందులు వాడినట్లయితే మంచి ఫలితాలు ఇస్తాయి. దూడలకు ఇది బాగా పనిచేస్తుంది. ఇది తన పూర్వీకుల నుండి నేర్చుకొని ప్రస్తుతం కూడా పాటిస్తున్నాడు.

కిరణ్‌భాయ్ మంగళ్‌భాయ్ గోహిల్ గారు నవీనగిరి, వడోదర జిల్లాకు చెందినవాడు. నల్ల మిరియాలు అజీర్తిని పోగొట్టేందుకు, వ్యాధికారక క్రిములను నాశనం చేసే శక్తికలవి. ఇవి కడుపు కుట్టు, నులి పురుగులు, మొలల వ్యాధి ఇతర గ్యాస్ సంబంధమైన జబ్బుల నివారణకు పని చేస్తాయి.

### కంటి రెప్పలపై వాపుకు నల్ల మిరియాలు

పశువులకు కంటి రెప్పమీద వచ్చే వాపుకు నాసిక్ జిల్లాకు చెందిన రాందాస్ పటేల్ నల్ల మిరియాలతో చేసిన మందు వాడేవాడు. కొన్ని నీళ్ళు కలిపి నల్ల మిరియాల పండును నూరి పేస్ట్‌లా తయారు చేసి కంటి వాపు వున్న ప్రాంతంలో పూసేవాడు. ఈ విధంగా రోజుకు రెండు, మూడు పర్యాయాలు చేస్తే రెండు మూడు రోజుల్లో తగ్గిపోతుంది.

49 సంవత్సరాల రాందాస్



ఆలోచనలకు రూపం యిస్తూ వుండే పుస్తక ప్రియుడు. బొమ్మలు వేసేవాడు, 11వ తరగతి వరకు చదివాడు అతడు ఈ విజ్ఞానాన్ని తన పూర్వీకుల నుండి స్వంతం చేసుకున్నాడు. కొద్దిపాటి పొలంలో కాలానుగుణంగా వ్యవసాయం చేస్తూ తను, తన భార్య, ఒక్క కుమారునితో జీవనం సాగిస్తున్నాడు. స్వచ్ఛందంగా సమాజ సేవ చేయాలన్నది అతని ధ్యేయం. నల్ల మిరియాల చెట్టు పండ్లు చాలా వైద్య విలువలు కల్గినవి. వీటిని పైపూతకు, కడుపులోనికి రెండు విధాలుగా వాడవచ్చు. దీని పేస్ట్‌ను పూయడం ద్వారా వాపు, నొప్పులను నివారించవచ్చు. ఇది

మొటిమలకు, వంటిపై వచ్చే వాపులకు, బొబ్బలకు బాగా పని చేస్తుంది.

## మూర్ఛ వ్యాధినుండి ఉపశమనం

లైలా నగర్ గ్రామానికి చెందిన రవికుమార్ మూర్ఛ వ్యాధి నివారణకు 'వస' చెట్టు వేరు పొడిని ఉపయోగించవచ్చని నిరూపించాడు. వస చెట్టు ఎండు వేరును మెత్తగా పొడిచేసి, తేనె లేదా పాలతో కలిపి ఇచ్చినట్లయితే మూర్ఛ వ్యాధి నివారణకు పని చేస్తుంది.

రవి ఉత్తర ప్రదేశ్‌లోని గంగాఇర్ పట్టణంలోని అలోక్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి. 18వ శోధయాత్రలో బయో డైవర్శిటీ పోటీలలో పాల్గొని వివిధ రకాల మొక్కలు,



వాటి ఔషధ గుణాలపై చక్కని జ్ఞానాన్ని సముపార్జించాడు. ఇది తన పూర్వీకులనుండి సంక్రమించింది.

'వస' చెట్టు వేరు పొడి మెదడును, నరాల వ్యవస్థను పునరుజ్జీవింప జేస్తుంది. అలాగే నరాల బలహీనత, మూర్ఛ వ్యాధి, జ్ఞాపకశక్తి క్షీణించడం, షాక్ మొదలగువాటి నివారణలో ఇది చక్కగా పని చేస్తుంది.

## వేరుసెనగ పంటలో గొంగళి పురుగు నివారణకు పల్లేరు జాతి చెట్టు

పల్లేరు జాతి చెట్టుకు చెందిన ఆకులను వేరుసెనగలో గొంగళి పురుగు ద్వారా వ్యాపించే తెగులు నివారణకు ఉపయోగించవచ్చని కుమారి ప్రశాంతి పరిశోధించింది. పల్లేరు జాతి చెట్టు ఆకులనుండి వచ్చిన పసరు (పాలు) విష సంబంధ లక్షణాలు కల్గి గొంగళి పురుగు కోశస్థ దశలో ఉండగానే దానిని నివారించడానికి పని చేస్తుంది. ఇది వేరుసెనగ పంటలో తెగులు నివారణకు సమర్థవంతంగా పని చేస్తుంది. పల్లేరు జాతి చెట్టునుండి లభించే పాక్షికంగా శుద్ధి చేసిన ద్రవం గొంగళి పురుగులను అండదశలోనే నిర్వీర్యం చేసి పుట్టబోయే పిల్లలను నివారిస్తుంది. అలాగే ఆవాలు పంటలో మొక్కలను ఆశ్రయించి పీడించే పురుగు ద్వారా వచ్చే తెగులు నివారణకు పారే నీటి కాల్వలలోనే ఈ పల్లేరు జాతి ఆకులను, కాడలను కలుపుతారు.

## చక్కని ఉల్లి పంటకు

ఉల్లిపంట అధిక దిగుబడి కొరకు క్యారెట్ పంటతో కలిపి నాటాలి. రెండుకూడా ఒకేసారి పుష్పించడంతో ఎక్కువ కీటకాలను ఆకర్షించి, పరాగ సంపర్కం ఎక్కువగా జరిగి రెండు పంటలు కూడా అధిక దిగుబడినిచ్చే అవకాశాలు మెండు. మహారాష్ట్రలోని జలగావ్ జిల్లా, పచోరె తాలూకాకు చెందిన మాధవరావ్ శంకరరావ్ పాటిల్, పింపిల్‌గాన్ హరీశ్వర్‌లు క్యారెట్ మరియు ఉల్లి పంటలను కలిపి ఒకే పర్యాయం సాగు చేసి విడివిడిగా సాగు చేసే పద్ధతికంటే ఈ విధానం చక్కగా పని



చేస్తుందని శోధించారు.

## కోళ్ళ ఫారాలలో కోళ్ళ దాణాలకు

జలగావ్‌కు చెందిన శ్రీ మాధవరావు గరు ఇలా సూచిస్తారు. కోళ్ళకు ఇచ్చే దాణాలో ఉల్లి, వెల్లుల్లి కలిపి వాడినట్లయితే ఈ ఘాటైన వాసనకు కోళ్ళలో వివిధ తెగుళ్ళకు కారణభూతమైన క్రిములు నశిస్తాయి. ఒక విధమైన కీటకాలు కుట్టటం మూలంగా ఏర్పడే బాధా నివారణకు వెల్లుల్లి బాగా పని చేస్తుందని, కొన్ని పరిశోధనలలో వెల్లడయ్యింది. కాలిఫోర్నియా యూనివర్శిటీలోని కొన్ని పరిశోధనలు పచ్చి ఉల్లిగడ్డను శరీరంపై రుద్దడం మూలంగా కొన్ని చర్మ వ్యాధులు, దద్దుర్లు, వివిధ కీటకాలు కుట్టడం మూలంగా ఏర్పడే మంటలు, దద్దుర్లు కూడా నివారించవచ్చునని సూచించారు.

## పశువులలో పాల ఉత్పత్తిని పెంచుటకు

అరటి మరియు రావి ఆకులు కలిసిన మేత పశువులలో పాల ఉత్పత్తిని పెంచడానికి దోహద పడుతుందని నిరూపించబడింది.

## బావిలో పడిన వస్తువులను వెలికి



## తీసే సాధనం (పరికరం)

లోతైన బావులలో పడిపోయిన వస్తువులను వెలికి తీసేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది. ఈ పరిశోధకుడు ఈ పరికరాన్ని 1997 నుంచి ఉపయోగిస్తున్నాడు. తక్కువ సమయంలో ఈ పరికరం యొక్క ఉపయోగం గ్రామమంతటా పాకిపోయింది. ఈ పరికరాన్ని అమ్మేవాడు కాదు. కాని, ఉపయోగించుకోవడానికి గ్రామస్తులందరికి

ఇచ్చేవాడు.

శ్రీ సాంబు సదాశివ్ పాటిల్, మొహిడా పోస్టు, షహద తాలూకా,



నందుర్బార్ జిల్లా, మహారాష్ట్రకు చెందిన ఇతను గొట్టపు బావులనుండి, సబ్‌మెర్సిబుల్ పంపులను పైకి తీయడానికి, లోపలికి దించడానికి కూడా ఒక యంత్రాన్ని తయారు చేశాడు. ఈ విషయాన్ని 2006లో ఎన్.ఐ.ఎఫ్. దృష్టికి తీసుకు వచ్చాడు. ఈ యంత్రం ఒక ఛాసిస్‌ను కల్గి రవాణా కొరకు ట్రాక్టరుకు గాని, జీపుకు గాని తగిలించ బడుతుంది. దీనిలో ఇంకా గేర్ రిడక్షన్ యూనిట్, హుక్‌తో సహా ఇనుప రాడ్లు, హ్యాండిల్, బెల్ట్ డ్రైవ్ మరియు గేర్ డ్రైవ్ ఉంటాయి. ఇది 3 హార్స్‌పవర్ మోటారుతో నడుస్తుంది.(నిమిషానికి 1440 సార్లు తిరుగుతుంది). గుజరాత్‌లోని కళ్యాణ్‌కు చెందిన బచ్చుభాయ్ సవాజ భాయ్ థేషియా గొట్టపు బావులు త్రవ్వడానికి ఉపయోగించేందుకు ఒక స్టాండును రూపొందించారు. నీళ్ళు తోడేటప్పుడు బావిలో పడిపోయిన బకెట్లు పైకి తీయడానికి సాధారణంగా ఉత్తర భారతదేశంలో ఒక హుక్స్ ఉన్న గుత్తి లాంటి దాన్ని (గాలాన్ని) ఉపయోగించేవారు.

**పరస్పరం పోటీలు పడి చిత్రహింసలు పెట్టుకునే చీమలు సన్నిహితులుగా కూడా ఉంటాయి :**

వ్యవసాయ అభివృద్ధిలో భాగంగా అంతర్జాతీయంగా జరిగే ప్రసంగాలలో ఆఫ్రికా సాధారణంగా సహకారం పొందేదిగా, సలహాలు స్వీకరించేదిగా వుంటుంది. సాంకేతిక పరిష్కారాలు సాధారణంగా బయటినుండి తెచ్చుకునేవిగా ఉంటాయి. ఆఫ్రికన్ సైన్స్ సెంటర్‌కు చెందిన గ్రామీణ ఆర్థిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించే పాల్‌వ్యాన్ మిలె "ఆఫ్రికా రైతుల పరిశోధనలు – సాంప్రదాయ విజ్ఞానం" అనే అంశంపై రూపొందిన డాక్యుమెంటరిలో ఇతర దేశాలు ఆఫ్రికా రైతుల నుండి ఏమి నేర్చుకోవాలి అనేది సవివరంగా చిత్రీకరించారు. అలాగే ప్రపంచంలోని ఇతర దేశాల రైతులనుండి వివిధ విషయాల సేకరణ గాక ప్రత్యేకించి ఒక జాతి ఎర్రచీమ (ఒకోఫిల్లా లాంగినోడి) కాఫీ పంటలకు చేస్తున్న చెరుపుకు నివారణ గూర్చి తెలుసుకోవడానికి పాల్ ప్రయత్నించేవారు. ఈ చీమలు మిగతా పంటలకు ఉపయోగకారి. పాఠకులు ఈ చీమలకు సంబంధించిన అనుబంధాలను పంచుకోవలసిందిగా కోరుచున్నాను.

**కాఫీ పంటలో ఎర్రచీమల నివారణ**

గునియా అనే అటవీ ప్రాంతంలోని గోపేటా గ్రామానికి చెందిన రైతు సోనోము. ఒకరోజు తన పొలంలో సామ్ చెట్టు కాయల గుత్తిని కోస్తూ కాఫీ చెట్టు క్రింద ఉన్న ఒక చిన్న పామ్ మొక్కకు వ్రేలాడుతున్న చెదల పుట్టపై కాలు వేశాడు. వెంటనే కాఫీ చెట్టునుండి వెలుపలికి వస్తున్న ఎర్రచీమల దండును చూశాడు. ఈ ప్రేరణ మూలంగా కల్గిన ఆత్రుతతో మరొక చెద పుట్టను కదిలించి చూశాడు. ఈ నల్లచీమల దండు మూలంగానే ఈ ఎర్రచీమల దండు వలస ప్రయాణం మొదలెట్టాయా అనేది శోధించాలనుకున్నాడు. కొద్దిపాటి నల్లచీమల కారణంగానే ఈ ఎర్రచీమలు పారిపోతున్నాయి అన్నది వాస్తవమని గుర్తించాడు. ఎర్రచీమలు కాఫీ పంటను నాశనం చేస్తుండటంతో నల్ల చీమలున్న ఆ చెద పుట్టలను ఎర్రచీమలను పారద్రోలటానికి ఉపయోగించసాగాడు. దీన్ని ఇతర రైతులతో పంచుకోసాగాడు. నేడు ఈ పరిశోధనను అనేకమంది రైతులు అనుసరిస్తున్నారు. చీమలలో అంతర్గత పోరాటంపై చేసిన పరిశోధన, అంతర్గత రక్షణ విధాన రూపకల్పనకు అనగా సైన్యాన్ని వ్యూహాత్మకంగా పోరాటానికి సిద్ధం చేయడం, తొలగించడం, వివిధ రూపాలుగా, వివిధ పేర్లతో వ్యవహరించడం మొదలగు వాటికి తోడ్పడింది. దక్షిణ గుజరాత్‌లోని థెజ్ గ్రామానికి చెందిన ధీరూభాయ్ దయాల్జీ భాయ్ పాటిల్ చీమలను క్రిమి సంహారకాలుగా ఉపయోగించేవాడు. అతను ఒక అగ్గిపెట్టెలో కొన్ని చీమలను సేకరించి పొలానికి తెచ్చేవాడు. చీమలను ఆ పొలంలో వదలగానే తీగలపైకి పాకి క్రిములతో పోరాటం ప్రారంభించి క్రిమి వినాశానికి తద్వారా పుష్కలమైన పంటకు, ఫలసాయానికి దోహదపడేవి.

**చింత ఆకుతో విత్తనాల శుద్ధి**

సాన్ పట్టణ ప్రాంతంలో జెనివా వాసి తాటి దిస్సాన వరిధాన్యం పండించేది. ఆమె విత్తనాలను భద్రపరచడానికి చింత ఆకులను వాడేది. చింత కొమ్మల నుండి ఎండిన చింత ఆకులను వేరుచేసి విత్తనాలతో కలపాలి. పూర్తిగా ఎండిన తరువాత ఈ



గింజలను వాటితో కలిపి చింత ఆకులను కలిపి గాలి చొరబడని పాత్రలో పోసి గట్టిగా మూత పెట్టాలి. విత్తనాలు అవసరమైనప్పుడు మాత్రమే పాత్ర మూత తీసి వాడుకోవాలి. ఈ

(మిగతా 21వ పేజీలో)

## పాఠశాల విద్యార్థుల సృజనాత్మక, సాంకేతిక పరిజ్ఞానంపై జాతీయ పోటీ

# ఇగ్నైట్ - 2009

**జాతీయ నవసృజన సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) ద్వారా**
**హనీబీ నెట్‌వర్క్, సృష్టి, సెకండరీ విద్యకు సంబంధించిన కేంద్రీయ బోర్డు (సి.బి.యస్.ఇ.) మరియు**
**ఇతర భాగస్వాముల సహకారంతో**

### ఇగ్నైట్ పోటీ అంటే ఏమిటి?

ఇగ్నైట్ అనేది పాఠశాల విద్యార్థుల లో దాగివున్న సృజనాత్మకతను, పరిశోధనాత్మక భావాలను వెలికి తీసేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ. విద్యార్థులను తమ సృజనాత్మక సాంకేతిక శోధనలను, పరిశోధనలను పంపవలసిందిగా కోరడం జరుగుతోంది. మొట్టమొదటి సారిగా ఈ 'ఇగ్నైట్' అనేది 2007లో నాలుగు దక్షిణాది రాష్ట్రాలకు జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.)చే నిర్వహించబడింది. ఈ అనుభవాన్ని ఉపయోగించుకొని ఎన్.ఐ.ఎఫ్., సి.బి.ఎస్.ఇ. భాగస్వామ్యంతో 2008లో ఈ పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహించింది. 2008లో నిర్వహించిన 'ఇగ్నైట్–2008'కు జాతీయ స్థాయిలో 19 రాష్ట్రాలలోని 62 జిల్లాలకు చెందిన 961 మంది విద్యార్థులు తమ పత్రాలను పంపడం జరిగింది. నవంబర్ 26, 2008లో అహమ్మదాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో జరిగిన ఒక సభలో డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి చేతులమీదుగా వీరికి అవార్డులు ప్రదానం చేయడం జరిగింది.

### ఇగ్నైట్ పోటీ ఎందుకు?

చిన్న పిల్లలలో సృజనాత్మకత అనేది సాధారణంగా పుట్టుకతో వచ్చేది. ప్రతిబిడ్డ ఒక సృజనాత్మకతా రూపం, కాకపోతే స్థాయిలో మార్పులు ఉండవచ్చేమోగాని మూల స్వరూపంలో, స్పష్టతలో ఎలాంటి తేడాలు ఉండవు. అయితే పిల్లలు పెరిగే కొద్దీ, యుక్త వయస్సుకు వచ్చేకొద్ది ఏం జరుగుచున్నది? పిల్లలు క్షేత్ర స్థాయిలో, మూల స్థాయిలో సందేహాలు, ప్రశ్నలు అడగటం ఎందుకు మానేస్తున్నారు? అసలైన, మూలమైన వాటిని వదిలేసి చర్విత చరణంగా ఉండే ఈ సైన్స్ ప్రాజెక్టులను చేయడానికే వారెందుకు ప్రాధాన్యత చూపిస్తున్నారు? సాంఘికమైన, వృత్తిపరమైన సమస్యలతోటే సహజీవనం చేయటమే ఎందుకు నేర్చుకుంటున్నారు? మన పిల్లలు అలాంటి సమస్యలతో సహజీవనం చేయడం నుంచి మనం వారిని వెలికి తీసుకరావాలి, ఈ సమస్యలకు పరిష్కారాలతో మన చిన్నారులు ముందుకు రావాలి. పరిష్కారాలు కనుగొనాలనే తృష్ణ వారిలో పాదుకొల్పాలి.

పిల్లలలో స్వంత కల్పన, సృజనాత్మకత, పరిశోధనాత్మక భావాలు పెంపొందించాలనేది మా ధ్యేయం. దీనిమూలంగా వారు మన సమాజంలో నాయకులుగా తయారైనప్పుడు మన దేశానికి కల్పనా శక్తిపరంగా, దక్షతపరంగా, పరిశోధనాత్మకంగా చక్కని భవిష్యత్తుకు బాటలు వేయగల్గుతారు. తాము, తమ కుటుంబాలు, ఇరుగు పొరుగువారే కాక, సమాజంలో సాంఘిక ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొనే వర్గాలు సైతం చవిచూసే సమస్యల పట్ల అత్యంత సునిశితంగా వ్యవహరించే విధంగా మన పిల్లలు తయారు కావాలి అనేది మన ఆకాంక్ష.

### ఇగ్నైట్ పోటీలకు వేటిని ఆహ్వానిస్తారు?

విద్యార్థుల్లోని స్వీయ కల్పన, సృజనాత్మకతతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిశోధనలను లేదా...

అనునిత్యం కూలివాళ్ళు, శ్రమజీవులు, అలాంటి ఇతర వర్గాలవారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు సూచించే ఎలాంటి సాంకేతికపరమైన సూచనలు, పరిశోధనలు.

అంతే కాక సెలవు దినాల్లో గాని, ఇతరత్రా గాని వారి సృజనాత్మకతతో రోజువారి వివిధ సమస్యలు ఎదుర్కొనేందుకు పరిశోధనాత్మక యంత్రాలను, పరికరాలను కనుగొనే వారితో కలిసి వారి జ్ఞానంలో పాల్పంచుకునే దిశలో పిల్లలను ప్రోత్సహించడం జరుగుతోంది. అలాగే తమతమ ఇళ్ళలోని ముందు తరాల వారినుండి ఇరుగు పొరుగు పెద్దవారినుండి తెల్సుకున్న సాంప్రదాయక విజ్ఞానాన్ని అక్షర రూపంలో బంధించేందుకు కృషి చేయడాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది. దీని ముఖ్య ఉద్దేశ్యం మనకున్న అత్యంత విలువైన సాంప్రదాయక విజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజెప్పడమే కాక, తరతరాలకు దానిని అందించే ప్రయత్నాన్ని సులభతరం చేయడం.

విద్యార్థులు తగు రీతిలో రూపకల్పన చేసిన పరిశోధనాత్మక, సాంప్రదాయ విజ్ఞానానికి చెందిన ఎన్ని ఎంట్రీలనైనా తమతమ పాఠశాల ద్వారాగాని, నేరుగాగాని, ఎన్.ఐ.ఎఫ్.కు పంపవచ్చు. ఎన్.ఐ.ఎఫ్. వారు ప్రశంసా పత్రాలు అందించడం జరుగుతుంది. విద్యార్థులు పంపిన ప్రతి పరిశోధన / సాంప్రదాయక విజ్ఞాన పత్రాలకు వారిని 'స్కౌట్'గా నిర్ధారింపబడును.

### ఈ పోటీలకు కాలపరిమితి ఎంత?

ఈ పోటీలకు ఎంట్రీలు 'ఏప్రిల్–15 నుండి ఆగస్టు 31, 2009 వరకు పంపవచ్చు.

### పరిశోధనలు ఎలా పంపాలి?

చివరితేది అనగా 2009 ఆగస్టు 31వ తేదిలోగా ఈ పోటీలకు పంపే పరిశోధనాత్మక వ్యాసాలు ఈ క్రింది విధంగా పంపవలసి వుంటుంది.

1. ignite09@nifindia.org కి వివరాలు ఇ–మెయిల్ ద్వారా పంపండి.

2. నేరుగా కాని, సంబంధిత పాఠశాల లేదా కళాశాల ప్రిన్సిపాల్ ద్వారాగాని ఈ క్రింది చిరునామాకు పోస్టుద్వారా పంపండి. ఇగ్నైట్-2009, జాతీయ పరిశోధనా సంస్థ-ఇండియా, బంగళా నెం. 1, శాటిలైట్ కాంప్లెక్స్, ప్రేమ్‌చంద్ నగర్ రోడ్, వస్త్రపురం, అహమ్మదాబాద్ - 380 015. గుజరాత్.

**ఈ పోటీలు జరిగే సమయంలో పంపే ఎంట్రీల సంఖ్యకు ఏదైనా పరిమితి ఉందా?**

లేదు. విద్యార్థులు ఎన్ని ఎంట్రీలు పంపగలిగితే అన్ని పంపవచ్చు.

**గ్రూపులవారీగా పంపవచ్చా లేక వ్యక్తిగతంగానే పంపాలా?**

ఒక గ్రూపులోని ప్రతి సభ్యుడు ఆ పరిశోధనకు / సూచనకు / ప్రాజెక్టుకు వ్యక్తిగతంగా తనవంతు కృషి వున్నట్లయితే గ్రూప్‌గా పంపవచ్చు. కాని ఆ గ్రూప్‌లో అధ్యాపకులు / తల్లిదండ్రులు సభ్యులుగా ఉన్నట్లయితే చెల్లదు.

**బహుమతులు ఎప్పుడు ప్రకటిస్తారు? ఎప్పుడు ఇస్తారు?**

విజేతల పేర్లు 2009 అక్టోబర్ 15వ తేదీన ప్రకటిస్తారు. అలాగే బహుమతులను అహమ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి చేతులమీదుగా వారి వీలును బట్టి అందజేయబడును.

అక్టోబర్ 15, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి జన్మదినాన్ని బాలల పరిశోధ నాత్మక దినోత్సవంగా నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ జరుపుకుంటోంది.

**ఎలాంటి ఎంట్రీలు ఈ పోటీలో పరిగణనకు తీసుకొనబడవు?**

సాధారణ వ్యాసాలు, అలాగే జనాభా, అవినీతి, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రత, నిరుద్యోగం మొదలగు సమస్యలపై సమర్పించే వ్యాసాలు అలాగే జలవిద్యుత్ ప్రాజెక్టులు, వర్షపునీటి వినియోగం, జలవనరులు, సూచికలు, వెర్మికంపోస్టు / వెర్మి వాష్, లెటర్ బాక్స్ అలారం ఇతర అలారంలపై ప్రాజెక్టులు, భావనలు (టెక్స్ట్ పుస్తకాలు, ఇతర పుస్తకాలలోని), విద్యుదుత్పాదనకు టర్బైన్‌ల వినియోగం, వివిధ కార్యకలాపాలకు సోలార్ ఎనర్జి వాడకం, వృధా బ్యాటరీల ద్వారా/ పేడనుండి/ రవాణా ద్వారా/ అలల ద్వారా/ భూకంపాల ద్వారా విద్యుత్ తయారీ మొదలగునవి అనుమతింపబడవు.

అధ్యాపకులు / తల్లిదండ్రులు మార్గదర్శకంగా ఉండి చేపట్టే ప్రాజెక్టులు, పిల్లలను తమ సృజనాత్మక శక్తితో వెలికి రానివ్వమని, వారికి ఎలాంటి సూచనలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ప్రత్యేకంగా కోరుతున్నాము. అధ్యాపకులు, తల్లిదండ్రులు తమ సూచనలు, ఉద్దేశ్యాలను నేరుగా మాకు పంపవచ్చు.

**మంచి సూచనలకు / పరిశోధనలకు ఎన్.ఐ.ఎఫ్. ఎలాంటి చేయూతనందిస్తుంది**

ఆచరణాత్మకమైన అన్ని చక్కని సూచనలకు / ఉద్దేశ్యాలకు పరిశోధనలకు ఆర్థిక సహకారం అలాగే అనుభవపూర్వక సలహాలు అందించడం జరుగుతుంది. సముచితమైన వాటి విషయంలో వారికి ఎలాంటి ఖర్చు లేకుండా వారిపేర సర్వహక్కులకై అవసరమైన చర్యలు చేపట్టబడును. ఇగ్నైట్ 2007లో విజయం సాధించిన అచ్చుర, ప్రీతిల పరిశోధన 'రెస్పిరోమీటర్'కు వారిపేర పేటెంట్ హక్కులకు, అన్ని వివరాలు సమర్పించడ మైనది. అలాగే ఇగ్నైట్-2008లో అర్హమైన వాటికి పేటెంట్ హక్కులకై చర్యలు చేపట్టడం మొదలయింది. అంతే కాకుండా కొన్ని ఆలోచనలు, ఔత్సాహికులను ఆకర్షింపవచ్చు. అలాంటి వాటి విషయంలో కొంత మొత్తం అందించేందుకు కూడా తగు లైసెన్సింగ్ విధానం రూపొందించబడుతుంది.

**ఏవేని సందేహాలు తలెత్తినపుడు నివృత్తి చేసుకునేందుకు ఎవరిని సంప్రదించాలి?**

ఎలాంటి అభ్యంతరాలకు, సందేహాలకు ఈమెయిల్
ignite09@nifindia.org
లేదా టెలిఫోన్ నెంబర్లు :
+91-79-26732456/2095
ఫ్యాక్స్ : +91-792673/903 లేక
టోల్‌ఫ్రీ నెంబర్ : 1800 233 5555
లో గాని, పల్లెసృజన కార్యలయాన్ని స్వయంగా కాని, లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని స్వయంగా కాని, ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చు.

**పై పోటీకి ఆంధ్రప్రదేశ్ నుండి వందల కొద్ది విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను 31 ఆగస్టు, 2009 లోగా పంపిస్తారని, మాజీ రాష్ట్రపతి డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి చేతులమీదుగా అవార్డులు అందుకుంటారని ఆశిస్తున్నాం. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని పెద్దలు సహకరిస్తారని విశ్వసిస్తున్నాం.**

**- ఎడిటర్.**

# చింత ఆకుతో విత్తనాల శుద్ధి

(19వ పేజి తరువాయి)

ప్రక్రియ కీటకాల బారినుండి కాపాడటానికి ఎప్పుడూ ఉపయోగించేవారు. వరి, జొన్న, ఉష్ణమండలంపై జొన్న, సోయా చిక్కుడు, బఠాణి మొదలగు విత్తనాలను ఈ చింత ఆకులతో భద్రపరిచే విధానాన్ని అనుసరి స్తున్నారు. (విడిగా ఎండబెట్టిన విత్తనాలను, ఎండబెట్టిన చింత ఆకులను కలిపి భద్రపరచినాకూడా ఇదే ఫలితాన్ని ఇస్తుంది). మిరియాలు, చింత ఆకులు పొడిచేసి, విత్తనాలతో కలిపి భద్రపరచినట్లయితే సుమారు నాలుగు సంవత్సరాల పాటు చెడిపోకుండా నిల్వ ఉంటాయని పరిశోధనల ద్వారా కూడా వెల్లడయింది.



# వరంగల్ జిల్లా ఆదివాసుల (కోయ) సంస్కృతి - ఆచారాలు

- పోదెం సమ్మయ్య

**హనీబీఏపి వాలంటీర్లు వరంగల్ జిల్లాలో ఆదివాసులతో 'జ్ఞాన సముపార్జన యాత్ర'లో మూడు రోజులు గడిపారు. వారి ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ పద్ధతులను గురించి, వారిలో ఒకరు శ్రీ సమ్మయ్య ఆదివాసీ పెద్దలను సంప్రదించి, ఎంతో శ్రమతో వివరంగా వ్రాసి మాకు అందించారు. యధాతథంగా ప్రధమ భాగాన్ని ప్రచురించాము. - ఎడిటర్**

ఆదివాసి ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలు, ఋషి ఆశ్రమ సాంప్రదాయముల నుండి వచ్చినట్లు మన పూర్వీకులు చెప్పినారు. అందువల్లనే సప్తగోత్రములు వచ్చినవి. నేటి మన సమాజంలో రాను రాను క్షీణించిపోతున్న ఈ తరుణంలో ఆదివాసి (గిరిజన) బిడ్డ పోదెం సమ్మయ్య మరియు సాంస్కృతిక సంఘం సత్ సంకల్పంతో ఆదివాసి సమాజానికి చెందిన సంస్కృతి సాంప్రదాయాలను నేటి సమాజమునకు అందించి పరిరక్షించే దిశలో భాగంగానే ఈ చిన్న కరదీపిక మీముందుంచాలనే ఆలోచనలతో గత మూడు సంవత్సరాల నుండి నిర్విరామంగా అనేక ఆదివాసి గ్రామాలను సందర్శించి, ఆదివాసి కులపెద్దలు, "తలపతి దల్వాయి మరియు ఆర్తిబిడ్డ" సహకారంతో ఆదివాసిల సంస్కృతి, సమాచారమును మన నేటి సమాజానికి అందించి, సమాజం పట్ల మన ఔన్నత్యమును పెంచుకుందామని ఆశిస్తూ పైన పేర్కొన్న పెద్దలకు, తలపతి, దల్వాయి మరియు ఆర్తి బిడ్డలకు, హార్థిక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను.

**దేవుళ్ళు వేల్పుల గురించి:**

ఒకరోజు గ్రామపెద్దలం నిర్ణయించుకొని బుధవారం ఆరోజు నుండే తలపతి ఇంటి దగ్గర నుండి పొన్ను తీసుకొని పసుపు కుంకుమ మరియు 2 కోడిపిల్లలతో గద్దె దగ్గరకు వెళ్ళి ఆ దేవున్ని పూజించి వడ్డెబోయిడు కలిసి కోడి పిల్లలను దేవునికి పెట్టి కోసి నైవేద్యం (రక్తపు బొట్టు) పెట్టుకొని పూజిస్తారు.

తర్వాత బుధవారం ఒక్కపొద్దు (ఉపవాసం) చేస్తారు. మూడవ రోజు అనగా గురువారం ఉదయం గట్టుకు వెళ్ళి వణం (కంకవృక్షం) తీసుకొని వచ్చి ఎదుర్కొని నిండు జాతర జరుపుతారు. దేవుడు అదే రాత్రి గంగ స్నానం చేసి గుడికి చేరుకుంటారు. అదేరాత్రి తెల్లవారుఝామున భోజనానికి వెళతారు. తిరిగి వచ్చి గుడి చేరుకుంటారు. శుక్రవారం రాత్రి సుంక పండుగ చిన్న పండుగ చేసి దేవుని గట్టుకు (గుట్టకు) పంపిస్తారు.

**కుల తప్పు:**

మన ఇంట్లో అమ్మాయి వేరే కులం అబ్బాయిని పెళ్ళి చేసుకున్నా, అబ్బాయి వేరే కులం అమ్మాయిని పెళ్ళి చేసుకున్నా ఆ గ్రామ పెద్దలు ఆ కుటుంబాన్ని కేటా (వెలి) వేస్తారు.

కేటా వేసిన కుటుంబ యజమాని గ్రామ (ఎట్టి) దల్వాయి, దౌడాయితో గ్రామములో పెద్దలను పిలిపించి వివరణ కోరినప్పుడు గ్రామ పెద్దలు ఆ యజమానితో తప్పు చెల్లించి యజమానికి గుండు గీయించి ఏడు చెలిమెల నీటితో స్నానం చేయించి కొండ నాలుక కాల్చిన తర్వాత ఆ యజమాని ఇంట్లో సామాగ్రి బయట వేసి ఇల్లు శుభ్రపరచిన తర్వాత గ్రామ పెద్దలు కలిసి ఆ ఇంటికి భోజనాలకు వెళతారు. గ్రామ దల్వాయికి

తప్పు (డబ్బు) చెల్లించిన తర్వాత ఆ గ్రామ దల్వాయి తిన్న తర్వాతనే కులమంతా భోజనం చేసి తమలో కలుపుకుంటారు.

**పెళ్ళి:**

ఒక అబ్బాయికి ఒక అమ్మాయితో సంబంధం కుదుర్చుకునే ముందు సంబంధ సోల్తి ద్వారా బంధుత్వం ద్వారా వారి ఇంటిపేరు, ఏ గోత్రం వారు, వరుస అవుతారో కాదో తెల్సుకొని వరస అయితే పిల్ల ఇంటికి వెళ్ళేటప్పుడు మంచిరోజు చూసుకొని ఐదు మంది లేదా తొమ్మిది మంది లేదా 11 మంది (ముత్తయిదువలు) పేరంటాళ్ళు స్త్రీ, పురుషులు కలసి బేసి సంఖ్యగా పిల్ల ఇంటికి వెళతారు. 'కుల పెద్ద తప్పక ఉండాలి'.

పిల్ల ఇంటికి వెళ్ళగానే పిల్లవారు కాళ్ళకు నీళ్ళు ఇచ్చి కూర్చొమ్మని అంటారు. సాయంత్రం 6 గంటలకు అమ్మాయి గ్రామంలో కుల పెద్దమనుషులను వారికి సంబంధించిన బంధువులను పిలుచుకుంటారు. అమ్మాయి మరియు అబ్బాయి తరుపున వారందరు కలిసి వారి వారి కుటుంబాల వరసలు మరియు గోత్రములు, పుట్టు పూర్వోత్తరాలు అనగా నీవు ఎవరి ఆడబిడ్డను చేసుకున్నావు అని మరియు ఆస్తుల వివరాలు మాట్లాడుకుంటారు.

వారికి సంబంధం నచ్చితేనే వారికి భోజనం పెడతారు. లేకుంటే సంబంధం కుదరదని తెల్చి చెప్పి అన్నం కూడా పెట్టరు. పెళ్ళి కుదరదని అర్థం.

పెళ్ళి సంబంధం కుదిరితే అమ్మాయి తరుపు వాళ్ళను అబ్బాయి ఇంటికి మంచిరోజు చూసుకొని రమ్మంటారు. వారు మంచిరోజు చూసుకొని వీరు కూడా 5 మంది లేదా 9 మంది లేదా 11 మంది కలిసి అబ్బాయి ఇల్లు చూడడానికి వెళతారు. వారు కూడా కాళ్ళకు చెంబులతో నీళ్ళు ఇచ్చి ఆహ్వానిస్తారు. వారి భూమి, ఆస్తులు (దొడ్డి, పశుసంపద) ఇంటి నడవడిక నచ్చితేనే వియ్యానికి ఒప్పుకుంటారు. ఇరువురికి సంబంధం ఇష్టం అయిన తర్వాత పెళ్ళి నిర్ణయం జరుగుతుంది.

పంచాంగకర్త దగ్గరకు పిల్లవారు పిల్లవాని తరుపువారు కలిసి వెళ్ళి తేది, లగ్న సుముహూర్తం పెట్టుకుంటారు.

అబ్బాయి ఇంటివద్ద పెళ్ళికి పెళ్ళి పందిరి పెట్టుటకు కులాన్ని మరియు కుల పెద్దలని పిలుస్తారు. పచ్చని పందిరి కులం అందరు కలిసి వేస్తారు. భోజనాలు తింటారు. తరువాత ముందు జోడాలు పిల్ల ఇంటికి పంపిస్తారు. అదేరోజు ఇల్లు కప్పడం, కట్టెలు తెప్పించటం, పారెటాకులు లేదా మోదుగాకులు తెస్తారు. సాయంకాలం పిల్లవానికి 5 మంది లేదా ముగ్గురు ముత్తయిదువలు ఇద్దరు పెద్దలు కలిసి నలుగు (పసుపు, కుంకుమ, నూనెతో) పెడతారు.

**కొట్నాలు:**

ఉదయం మేళాల వారిని పిలిపిస్తారు. వేసిన పందిరి కింద నేలమీద మూడు లేదా 5 రోళ్ళ గుంతలు చేస్తారు. పేడతో శుభ్రపరుస్తారు. మేళాలతో కుల ముత్తయిదువులతో వెళ్ళి ఊరి ముత్యాలమ్మకు బొట్టు పెడతారు. ఆ తర్వాత మేళాలతో ఇంటింటికి వెళ్ళి బొట్టు పెట్టి 'కొట్నాలు' పెట్టాలని ఇంటికి రావాలని కోరతారు. పెళ్ళి పందిరిలోకి అందరూ వస్తారు. అప్పుడు ఆ పేరంటాలు ఐదు (5) రోకల్లు కట్టగా అమర్చి కట్టె కడిగి 5 రోకండ్లకు పసుపు, కుంకులమతో పూజించి 5 కంకణాలు కట్టి 5 మానుకల (వడ్లు) కొత్త గంపలో ఆ ధాన్యము పోసి ఆ ఇంటివారి గోత్ర ఇలవేల్పుకు నమస్కరించి, ధూప, దీప నైవేద్యాలను (పసగి) ఇచ్చి ముగ్గురు ముత్తయిదువలు, ఇద్దరు మగవాళ్ళు కలిసి ఐదు రోకల్లు ఎత్తి ఐదుగురు ఐదు చేతులతో పట్టి ఆ ఇంటి గోత్ర ఇలవేల్పును తలుస్తూ ఐదుసార్లు ఆ వడ్లపై మోపుతారు. రోకల్లు తీసి ముందుగా చేసిన 5 రోకళ్ళలో ఆ వడ్లు పోసి అదే 5గురు పూర్తిగా బియ్యం వచ్చేవరకు దంచుతారు. అదే గంపలో బియ్యం ఎత్తి అదే 5 గురు ఆ గంపను ఇంట్లో పెద్దల మూల (ఈశాన్యమున) భద్రపరుస్తారు. అవే బియ్యం తలంబ్రాల వరకు ఉంచి తలంబ్రాలు పోస్తారు. తరువాత పిల్లలకు, పెద్దలకు భోజనాలు పెడతారు.

**ఊరింద (తరలిపోయే భోజనం):**

మేళ తాళాలతో ఇంటి పెద్ద మరియు ముత్తయిదులు కలిసి గ్రామంలో ఇంటింటికి వెళుతూ పసుపు కుంకుమలతో బొట్టు పెడుతూ కంకణం కట్టి పెళ్ళికి రావాలని కోరతారు. ఒకవేళ ఇంట్లో ఎవ్వరూ లేనట్లయితే ఆ ఇంటి ఈశాన్య (నివాస) మొగరంకు పసుపు కుంకుమ కంకణం కడతారు.

అందరూ ఆ పెళ్ళి ఇటికి చేరతారు. మేళాలతో ముత్యాలమ్మకు బొట్టు పెట్టి వస్తారు. అందరూ కలిసి పిల్లవానికి నలుగు పెడతారు. కొత్త బట్టలు కట్టి (పంచ, లాల్చి, రుమాలు) అలంకరిస్తారు. అతనితో తోడు పెళ్లికొడుకును (వరుసకు బావమరిది) కూర్చోబెడతారు. అబ్బాయిని అమ్మాయి తరుపు తల్లిదండ్రులు, మేనమామలకు కాళ్ళు మొక్కించి నమస్కారం చేయించి ఇంటి ముందు పందిరిలో కూర్చోబెట్టి కాళ్ళకు పాయిరాళ్ళు, బుగ్గన చుక్క, కుంకుమ బొట్టు, చేతులకు పసుపు రాసి, కంకణాలు కట్టి అలంకరించి 5గురు పెద్దలు (3+2) అక్షింతలు వేస్తారు. ఆ తరువాత ఇంట్లో ఈశాన్య గదిలో కూర్చోబెడతారు.

కొట్నాలు అయిన రోజున అమ్మాయి ఇంటికి ఫలాన రోజు తరలి వస్తున్నట్లు ముందు జోడ పంపుతారు. అందరూ భోజనాలు అయిన తరువాత అమ్మాయి గ్రామానికి తరలివెళ్ళడానికి వాహన సౌకర్యం, ఎడ్ల బండ్లు, లేక కాలి నడకన వెళతారు. ఎదురు విందు కోసం బియ్యం, వంట సామాగ్రి, మొదలైనవి వెంట తీసుకెళతారు. మార్గమధ్యమున కాళ్ళ తీపుల 'కల్లు' అందరూ కలిసి త్రాగుతారు.

వారు ముందు అనుకున్న మాట ప్రకారం ఎదురు ఖర్చు అనగా అమ్మాయివారు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే అబ్బాయివారు బియ్యం, పప్పు, కూరగాయలు, మేకపోతు

కూడా (ఎదురేట) ఇస్తారు. లేదా మేకపోతు సరిపోయే డబ్బు ఇవ్వాలి.

ఆ గ్రామానికి చేరువలో ఆగుతారు. పిల్లగల వారికి తెలియపరుస్తారు. అది తెలుసుకొని చప్పుళ్ళు తీసుకొని పిల్లవారు పెళ్ళికి వచ్చిన వారికి గ్రామంలోకి తీసుకు వచ్చి పిల్లవారి ఇంట్లో నిషాన గుంజకు బొట్టు పెట్టిన తర్వాత కాళ్ళకు నీల్లు ఇచ్చి వేరే ఇల్లు (విడిదిల్లు)లో ఉంచుతారు. పిల్లగాని వారు తెచ్చిన వంట సామాగ్రి బియ్యం, పప్పు మొదలైనవి విడిది అన్నంగా వంట చేస్తారు. పిల్లగాని కులస్తులు, పిల్ల కులస్తులు కలిసి ఆ వండిన భోజనాలు చేసిన తరువాత ఎదుర్కోళ్ళ వద్ద అమ్మాయి, అబ్బాయి తరుపున ఇరువురికి చెల్లాలు కప్పిస్తారు. ఎదుర్కొన్న తర్వాత ముత్యాలమ్మ కు, బొడ్రాయికి, తదితర దేవతలకు మేళ తాళాలతో పసుపు కుంకుమలు సమర్పిస్తారు. గ్రామ పెద్దకి బొట్టు పెట్టి కంకణం కట్టి, కుల పెద్దలందరికి బొట్టు పెట్టి అందరిని పిల్లను ప్రదానం చేయుట గురించి ఆహ్వానిస్తారు. అందరు వచ్చిన తర్వాత కడప తెచ్చి, చిన్న సారక తెచ్చి బోదల మట్టి తెచ్చి తోరణం కట్టి, ప్రదానం పీట తెచ్చి ఎదురేప కోసి ప్రదానం ముగ్గు పోసి పిల్లను స్నానం చేయించి పసుపు కుంకుమలతో అలంకరించి తోడి పెండ్లి పడుచును వెంట తెచ్చి పచ్చని పందిరి క్రింద కూర్చోబెట్టి పెద్దలు పేరంటాళ్ళు నలుగు పాటలు పాడుతూ అక్షింతలు వేసి వేడి నీళ్ళతో స్నానం చేయించి, ఇంట్లోకి తీసుకెళ్ళి కొత్త వస్త్రాలు ధరించి పెళ్ళి పిల్లను చేస్తారు.

పిల్ల మేనమామ కాళ్ళు చేతులు కడిగించి పాయిరాలు పెట్టి ప్రదానం పీటపై మేనమామను పిల్లను కూర్చోబెడతారు. ఆ తరువాత పిల్లకు ఒప్పుకున్న బంగారం మొదలైన వస్తువులు ధరింపజేస్తారు. మేనమామకు పచ్చడం (దుప్పటి) కప్పుతారు. తల్లిదండ్రి పచ్చడం అమ్మమ్మ పుట్నం (చీరె) ఇలాంటి వస్త్రాలు పిల్ల చేతిలో పెడతారు. వాటితో 5 రూపాయలు పై పచ్చడాల మీద ఇస్తారు. ఇవన్ని పిల్ల బంధువులకు నచ్చునిచో ఎగతాళిగా మాట్లాడతారు. నచ్చినచో స్వీకరించి పిల్లను వస్తువులను, వస్త్రాలను ఇంటిలోకి పంపుతారు.

ఆ తర్వాత గోత్రమునకు సంబంధిం చినవి గోత్రంకు తగినట్లు ఉదా. 3వ గోత్రంనకు మూడు పోకలు, 3 కొత్తలు, 3 ఖర్జూర పండ్లు, 3 పసుపు కొమ్ములు, కుంకుమ చిట్టీలు, 3 కంకణాలు పెండ్లి పడుచుకు వేసే బాందు. ఈ విధంగా ఆ గ్రామ పెద్దలు, ఈ గ్రామ పెద్దలు వాటిని పరిశీలించి, ఇందులో ఏ ఒక్కటి తక్కువైనా ఒక్కదానికి 25 రూపాయలు జరిమానా విధిస్తారు. అన్ని సమానంగా ఉన్నచో ఏమీ అభ్యంతరం లేదు. వీటిని ఒకచోట చేర్చి పగలగొట్టి కూర్చున్న వారంతా సమానంగా తీసుకుని పెద్దల భాగం మరియు పేరంటాల భాగం అని రెండు భాగాలుగా చేసి అందరూ తింటారు. అందరూ కలిసి భోజనాలు చేస్తారు.

ఆ తర్వాత ఇంట్లోకి పంపిన పెండ్లి పిల్లను పేరంటాళ్ళు, దోస్తులు కలిసి కొత్త బట్టలతో, పూల మాలలతో, అత్తరు మొదలైన వాటితో అలంకరిస్తారు. అత్త, మామ, పెద్దల ముందు అప్పగించుటకు పిలుస్తారు. అత్తగారి చేతిలో పిల్లను పెడుతూ అత్తవైనా నీవే, తల్లివైనా నీవే, నీ కన్న బిడ్డలాగా చూసుకో, ఎలాంటి కష్ట సుఖాలకైనా మీరే బాధ్యులుగా చూసుకోవాలి. మీ కోడలును మీకు అప్పగిస్తున్నాము. మాకు ఎలాంటి బాధ్యతలు లేవు అని మేనమామలు, పెద్దనాన్న, పెద్దమ్మ, చిన్నమ్మ, చిన్నాన్నలు పెద్దలందరికి పిల్లచేత కాళ్ళు మొక్కించి అన్నతమ్ముళ్ళు, బావల కాళ్ళు మొక్కించి ఒడియాల బియ్యంలో అందులో ఒక కుడుక, ఐదు పోకలు, కర్జూర పండ్లు, కంకణాలు, అద్దం, దువ్వెన, కుంకుమ భరిణ, పసుపు బియ్యం కలిపి కొత్త తువ్వాలలో కట్టి నడుముకు కడతారు. చేతికి కటారి, కత్తి ఇచ్చి మంగళ హారతులతో ఐదుగురు పేరంటాల్లు వచ్చి ఇంట్లోనుండి బయటికి వచ్చేముందు కాళ్ళు అక్కా చెల్లెల్లు కడిగి, బొట్టు పెట్టి నెత్తిన చెంబు పెట్టుకొని కూర్చుంటారు. తల్లిదండ్రులు రూ. 116/-లు ఇచ్చిన తర్వాత లేస్తారు. అందరూ కలిసి ఎడ్లబండి ఎక్కిస్తారు. పిల్లతో నలుగురిని తోడుగా పంపిస్తారు. మార్గమధ్యలో కాల్ల తీపుల కల్లు త్రాగుతారు. పిల్లవాని ఇంటికి చేరగానే పిల్లచేత పిల్లవాని ఇంటి నిశాన మొగరంకు బొట్టు పెట్టిస్తారు. పందిరిలో పీటలు వేసి, పిల్లను పీటమీద నిలబెట్టి పిల్లవాని ఇంట్లో నుండి గడప ఇవతలకు తీసుకు వచ్చి ఇద్దర్ని పీటలపై నిలబెట్టి పిల్లతో పిల్లగానికి బొట్టు పెట్టించి, కంకణాలు కట్టిన తర్వాత పిల్లవాడు పిల్లకు బొట్టు పెట్టి కంకణాలు కట్టిన తర్వాత మెడలో బొందు వేసి పీటలపైన పిల్లవాడు ఐదుసార్లు పిల్ల కాళ్ళు తొక్కిన తర్వాత పిల్లతోని పిల్లవాని కాల్లు తొక్కించి పిల్లవాని ఇంట్లోకి పంపించి, పిల్లను విడిదింట్లోకి పంపిస్తారు. పిల్ల తరుపు బంధువులు అన్ని పెట్టిపోతలు సర్దుకొని బయలుదేరి పెండ్లికొడుకు ఇంటికి చేరుకుని, విడిదింట్లో ఉంటారు.

ఆ సాయంకాలం వేళ ఇరుపక్షాల కులస్తులు చప్పుళ్ళతో కలిసి ముత్యాలమ్మకు, బొడ్రాయికి వేల్పులకు కంకణాలతో అలంక రించిన తరువాత గ్రామ పెద్దల ఇంటింటికి వెళ్ళి బొట్టు పెట్టి కంకణం కట్టి పెళ్ళికి ఆహ్వానిస్తారు. అందరూ వచ్చిన తర్వాత అందరూ కలిసి పిల్లవాని ఇంటివద్ద వడ్డెతో కలిసి చప్పుళ్ళతో కడప తెస్తారు. కడపకాడ కుడక, రైకబట్ట, గంటెతో నిప్పులు గుగ్గిలం (పొగ) మైచ్చాసితో సహా పైన వొల్చెం, వడ్డెదొర ఇద్దరికీ కాల్లకు పసుపు కుంకుమతో పాయిరాలు పెట్టి ముఖానికి బొట్టు పెట్టి ముగ్గురు పేరంటాల్లు, ఇద్దరు పెద్ద మనుషులు వెరసి ఐదు మంది కలిసి వడ్డెకు, దొరకు కడప ఎత్తాలి. ధూప దీప నైవేద్యాలతో కూకలతో ఉగ్రాలతో ఎగురుతూ కడపతో ఇల్లు చేరిన పిదప ఆడబిడ్డలు కాళ్ళు కడిగి చెంబు నెత్తిన పెట్టుకొని కూర్చుంటారు. వారికి కట్నం వేసిన తర్వాతనే లేచి కడప కడిగి పసుపు కుంకుమ బొట్టు పెట్టి దండం పెట్టి లేస్తారు.

ఇంట్లో నుంచి ఐదుగురు పేరంటాల్లు కొబ్బరికాయ, ఊదుబత్తీలు, జాకెట్ ముక్కా, పసుపు కుంకుమ గంటెలో నిప్పుల గుగ్గిలం మైచ్చాసి, చప్పుళ్ళతో ఒల్పింతోని పాలపొరకకు అందరూ కలిసి వెళ్తారు. వెళ్లిన తర్వాత పాల పొరకకు వద్దె 5 మండలు కడిగి పసుపు కుంకుమ పెట్టి 5 కంకణాలు కట్టి అగర్ బత్తీలు వెలిగించి కొబ్బరికాయ కొట్టి కొత్త గుడ్డ మండలకు కట్టి అందరూ బొట్టు పెట్టుకొని కంకణాలు కట్టుకొని ఐదుగురు ముత్తయిదువలు ఆ మండలను ఎత్తుకొని చప్పుళ్ళతో ఒల్చెం పట్టుకొని వస్తూ వస్తూ (సమ్మక్క) గుడిమీద వేసిన తర్వాత వచ్చిన పందిరి పచ్చ చేస్తారు.

**బోదెల మట్టి :**

చప్పుళ్ళతో ముత్తయిదువలు అబ్బాయి తరుపున ముగ్గురు, అమ్మాయి తరుపున ఇద్దరు మరియు వడ్డెడ ఒక గడ్డపార, కోడిపుంజు, పసుపు కుంకుమ, కంకణాలు తీసుకుని వెళ్ళి ఒకచోట మట్టిని త్రవ్వడానికి అక్కడ గడ్డపారకు కంకణం కట్టి ముగ్గు వేసి కోడిపుంజుకి బొట్టు పెట్టి వడ్డె కంకణం కట్టుకుని అక్కడ ఉన్న పెద్దలకు కంకణాలు కడతారు. బోదెల మట్టిని తీసుకు రావడానికి వెళ్ళిన పేరంటాల్లకు కంకణాలు కట్టి మట్టి ముద్దలు చేతిలో పెట్టేముందు భర్తల పేర్లు అడిగి తెలుసుకుని బోదెలమట్టి ముద్దలు ఐదుసార్లు తీసుకు వస్తారు. ఆ మట్టిని పెండ్లి పందిరిలో వున్న గుంజల చుట్టూ బోదెలు పోసి ఆ మట్టితో ఐదుమంది పెద్దలు కలిసి నాగబెల్లి గద్దె కొలతలతో వేస్తారు. అందులో నవధాన్యాలు, పసుపు, కుంకుమ వేస్తారు.

**పచ్చని దోర్నం కట్టుట :**

మేళ తాళాలు వాయిస్తూ ఉండగా అబ్బాయి తరుపువారు ముగ్గురు, అమ్మాయి తరుపువారు ఇద్దరు వెరసి ఐదుమంది మగవారు నులక తాడును కాల్చుతారు. చాకలితో మామిడాకులు తెప్పించి నులక తోరణానికి ఆకులు పెట్టి ఆ తాడును నిషాన మొగరం నుండి మొదలుకొని పందిరి మొత్తం మెలకపడకుండా తీసి నిషాన మొగరం వరకు వచ్చిన తర్వాత మిగిలిన తాడును తెంపకుండా పందిరిపై పెడతారు. కులబాపతులు పిల్లవాని వైపునుండి రెండు భాగాలు, పిల్లవైపునుండి ఒక భాగం తీసుకుంటారు. అందరూ కలిసి సారాయి త్రాగుతారు.

**అవిరేని కుండలు తెచ్చుట :**

చప్పుళ్ళతో ఆవిరేని కుండలు తెచ్చేముందు మూనెడుసోడు బియ్యం (5 కిలోలు) ఒక కుడక, ఒక రైకబట్ట తల్లికోడి కుమ్మరికి ఇచ్చిన తర్వాత వడ్డె, దొర, చప్పుల్లతో ధూపదీప నైవేద్యాలతో ఆ అవిరేని కుండలు తెస్తాము. మన కడపకాడ కోడిపిల్ల, తెల్లముద్ద, నల్లముద్ద, ఎర్రముద్ద, వీటిని ఆ విరేని కుండలమీదినుండి దిగదుడిపిన తర్వాత ఇంట్లో ముగ్గు వేసి బియ్యం పోసి పెడతాము. మంగళారతి పెడతాము. కుండలలోపల పిరికెడు చొప్పున బియ్యం, చక్కెర, పసుపు, కుంకుమ వేస్తాము. పెండ్లి అయ్యేవరకు కుండలపై ఒక చెద్దరి కప్పి దీపం ఆరకుండా చూస్తారు.

**ఎదుర్కొనుట :**

పిల్లగాని కొత్తబట్టలు, దండలు, బాసింగాలు వేసి పసుపు కుంకుమ సర్దుకొని ఎదుర్కొనడానికి పోవడం. పిల్లవాళ్ళు కూడా ఈ విధంగానే తయారై వారు వీరు చప్పుళ్ళలో ఎదుర్కొంటారు. ఎదుర్కొనేటప్పుడు కర్ర సాము, వేశాధారణ సంతోషంగా జరుపుతారు. తర్వాత పిల్లవాడు పిల్లకు దండలు, బొందు, బాసికం వేసినంక పిల్ల పిలగానికి దండలు వేసి పిల్లవాని ఇంటి పందిరి కిందికి వస్తారు.

**మైలపోలు :**

5 తవ్వల వడ్లు, 5 తవ్వల బియ్యం పోసి నలుమూలల నాలుగు 2 చెంబులు, 2 గురుగులు, 2 కాండ్లు, కాండ్లకు పసుపు, కుంకుమ రాసి కంకణాలు కట్టి మైలపోలుమీద కాండ్లు పెట్టి పిల్ల, పిలవానికి పాతబట్టలు కట్టించి పోలుచుట్టు తిరుగుతూ ముంతలో చిల్లరపైసలు పోకలు, పసుపు కొమ్ములు, కర్జూర పండ్లు ఆ గురుగుల్లో వేసి పోలుపై కూర్చోబెట్టి పిల్లకు పిల్లవానికి గట్టిపెట్టి గడ్డం, మీసాలు తిప్పి చప్పుళ్ళ వారికి ఇస్తారు.

ఆ తర్వాత ఇద్దరికి ఐదుగురు పేరంటాలు స్నానాలు చేయించేకాడ ఐదు బకిట్ల పైన కొంగులు కప్పుకొని కూర్చుంటారు. పెండ్లి పిల్లవాని తండ్రి 10 రూపాయలు ఇచ్చిన తర్వాత స్నానాలు ఇద్దరికి పోసి, లగ్నం పోలు, బట్టలు ధరింపజేస్తారు. లగ్గం గుంజె తెచ్చకాడ కడక రైకబట్ట పసుపు, కుంకుమ, ధూపదీప నైవేద్యాలు వొల్చెం వద్దె ద్వారా పోయి తేవడం తెచ్చిన తర్వాత, లగ్గంపీట, నల్లపూసలు, తెచ్చేకాడ మండపం కింద కుడక రైక బట్ట చప్పుల్లతో తెస్తారు.

**తలంబ్రాలు పోలు :**

ఆ తర్వాత లగ్నంపోలు చాకలి వారితో 10 కంచాలు వడ్లు, 5 తవ్వల బియ్యం, రెండు కాండ్లు, వడ్లపై పెట్టి పెండ్లిపీటలు పెట్టి అయివేన్లు పెట్టి బ్రాహ్మణ అయ్యగారు మంత్రపూజలు చేసి పిల్లను పిల్లవాన్ని ఐదుగురు పేరంటాలు లగ్నంపోలు వద్దకు తీసుకు వచ్చి బ్రాహ్మణుని ద్వారా పోలుచుట్టు ఎడమ నుండి కుడికి మూడుసార్లు త్రిప్పి పిల్లను ఎడమ, పిల్లవాన్ని కుడివైపు పీటలపై కూర్చోబెట్టి ఇద్దరి మధ్య బట్టతెర పెట్టి పాలు, నెయ్యి కుడకలో పోసి ప్రమాణం చేయించి ఆ పాలను పిల్లకు, పిల్లవానికి త్రాగిస్తారు. కంకణం కట్టి, బొట్టుపెట్టి జీలకర్ర, బెల్లం ఒకరి తలపై ఇంకొకరిచేత పెట్టిస్తారు. టైమును బట్టి పుస్తె, మట్టెలు తొడిగిస్తారు.

మంగళ సూత్రం ఒక కుడకలో పెట్టి బ్రాహ్మణుడు అందరికి చూపించినపుడు అందరూ ఆశీర్వదిస్తారు. అప్పుడు పిల్లవాని చేతికిస్తారు. పిల్లవాడు అందరికి ఆ మంగళ సూత్రాన్ని చూపించి సరైన ముహూర్తానికి పిల్లమెడలో కట్టేస్తాడు.

బ్రాహ్మణుడు కట్నాల బాపతివి తలంబ్రాలు బియ్యం కుడకతో కొలిచి పిల్లవాని చేతిలో కొన్ని, పిల్ల చేతిలో కొన్ని పోస్తాడు. పిల్లలు, పిల్లవాన్ని శిరస్సుపై పోయమని,



పిల్లవాన్ని పిల్ల శిరస్సుపై పోయమని ఆజ్ఞాపిస్తాడు. అలా మూడుసార్లు పోసుకున్న తర్వాత పెండ్లికి వచ్చిన అందరికి తలంబ్రాల బియ్యం ఇస్తాడు. అందరూ పిల్లపై, పిల్లవానిపై మూడుసార్లు తలంబ్రాల బియ్యం వేసి ఆశీర్వదిస్తారు. లగ్నం సంపూర్ణం తలంబ్రాలు అయిపోయినవి.

**నాగబెల్లి పోలు:**

నాలుగు మూలల నాలుగు చెంబులు పెట్టి చుట్టూ 5సార్లు దారం తీసి పసుపు, కుంకుమ చెంబులకు పెట్టి నాగబెల్లికి కుడక, రైకబట్ట కప్పి నల్లపూసలు పిల్లవాని చేత పిల్ల మెడలో వేయిస్తారు.

తర్వాత భోజనాలు చేయించి, కట్నాలు, కానుకలు చదివిస్తారు. ఆ తర్వాత పెండ్లి పిల్లవాడు నాగలితొల్ల కట్టి కట్టుం ముల్లుకర్ర, పట్టుజూని పిల్ల సద్ది, కొడవలి నీళ్ళు పెట్టుకొని బయట అరుంధతి నక్షత్రాన్ని చూపిస్తారు. ఇంటి పొలిమేరలో (నల్లకుండలవైపు) పేరంటాలు తీసుకొని పోయి అబ్బాయితో దున్నించి, పిల్లతో గడ్డి ఏరించి, విత్తనాలు చల్లిస్తారు (ఆడబిడ్డలు). వదిన, మరదళ్ళు, బావలు, నవధాన్యాలు ఆ దుక్కిలో చల్లిస్తూ ఉండగా ఆట పట్టిస్తారు. పిల్లనిస్తావా, ముల్లెనిస్తావా అని అడగగానే పిల్లనే ఇస్తానని ఒప్పుకుంటారు.

ఆ తర్వాత పేరంటాలు పారేటి నీళ్ళు తెచ్చి పందిరిపై ఉంచి పిల్ల, పిల్లవాడు ఇంట్లోకి వెళ్ళేటపుడు ఆ నీటిని వారిమీద పోసి తడుపుతారు. వర్షానికి తడిశారని ఆట పట్టిస్తారు. సరదాగా బట్టలు మార్చి మళ్ళీ పెండ్లి బట్టలు వేసుకొని బోనం పెట్టుకొని వొల్చెం చప్పుళ్ళతో పోచమ్మ (ముత్యాలమ్మ)కు పెట్టి పిల్లను, పిల్లవాన్ని ఇద్దరిని పిల్ల ఇంటికి తీసుకు పోతారు. తీసుకుపోయిన తర్వాత వాళ్ళు పిండితో సారె తయారు చేసుకొని వడ్డెతో కొత్త ముంతలతో కావడిలో పెట్టుకొని పిల్ల ఇంటికి వస్తారు. సాయంత్రం పేరంటాలని పిలిచి మంచం వేసి దుప్పటి పరిచి ఎదురెదుగా కూర్చోబెట్టి తెచ్చిన సారెపప్పు మధ్యలో పోసి, అందరికి చూపించి పిల్లలు, పెద్దలు, పేరంటాలకు సారె పంచుతుండగా పందిరిపై నుండి పారేటి నీళ్ళు పోస్తారు.

ఆ సాయంకాలం పెద్దలు కూడి సాయంత్రం వడ్డెబోయిడు కలిసి ద్వారంకు అటూ ఇటూ కోడిని కొట్టి ఇంట్లో పడేసి కాళ్ళు కడుక్కొని అందరూ కలిసి కల్లు త్రాగుతారు. ఆ దీపము ముత్తాలమ్మ కాడికి తీసుకుపోయి పసుపు, కుంకుమ, ముత్యాలమ్మకు అర్పించి, వండిన పుల్గం ముద్దలు, ఎదురెదురుగా పిల్ల, పిల్లవాన్ని కూర్చోమెట్టి చెరొక ఇస్తరు వేసి ఎంగిలి పులగం ముద్దలు తినిపిస్తారు. వారికున్న లగ్నం కంకణాలు తెంపకుండా ఒకరివి ఒకరు ఇప్పి ముత్యాలమ్మకు దండం పెట్టి ఇంటికి వెలుతూ ఉంటే పెండ్లిపిల్ల నెత్తిమీద వున్న పులగం కుండను కొంతమంది పిల్లలు గుంజుకపోయి పిల్లలే తినేస్తారు. ఆ సమయంలో ఇరువురికి వరస అయ్యేవాళ్ళు ఒకరిపై ఒకరు నీళ్ళు పోసుకుంటారు. దీన్నే పెళ్ళి వసంతం అంటారు. (పెళ్ళిబొక్క విరుచుట).

ఆ తర్వాత స్నానం చేయించి, కొత్త బట్టలు ధరించి, శోభనం రాత్రిని గడుపుతారు. తెల్లవారి వచ్చిన వారితో బంధువులతో భర్త ఇంటికి వెళతారు. దీన్నే ఏర్నాలు అంటారు.

కొత్తలో అక్కడ కొన్ని రోజులు ఇక్కడ కొన్నిరోజులు వారిద్దరు ఒకటి అయేంత వరకు అలాగే తిప్పుతారు. ఇది. పెళ్ళి వ్యవహారం.

(వచ్చే సంచికలో మరికొన్ని సాంప్రదాయాలు

– ఎడిటర్)

**మీరు ఎప్పుడైనా మీ తాత, ముత్తాతల విజ్ఞానం గూర్చి తెలుసుకోవడానికి ప్రయత్నించారా? ప్రయత్నిస్తే ఉత్తేజకరమైన, ఉత్సాహ భరితమైన, ఆసక్తికరమైన ఆ జ్ఞానాన్ని మాతో పంచుకోండి. వాటిని వెంటనే మాకు వ్రాసి పంపండి. ఎంపికైన అంశాలను మీ తాత, ముత్తాతల ఫొటోతో సహా ప్రచురించడం జరుగుతుంది. పెద్దవాళ్ళ ఫొటోలు పంపడం మరవకండి.**

– ఎడిటర్.

# స్పందన

ఎడిటర్ గారికి,

నాకు కొన్ని కొత్త ఆలోచనలు వచ్చాయి. వాటిని మీకు పంపుతున్నాను. వాటిని హనీబీ పత్రికలో ప్రచురించవలసిందిగా కోరుకుంటున్నాను. మరియు వాటిని అభివృద్ధి చేయుటకు సంబంధిత వ్యక్తులతో నాకు అనుసంధానం కుదర్చవలసిందిగా కోరుకుంటున్నాను. ఈ ఆలోచనలకు పేటెంటు పొందు విధానం మరియు వీటిని రిజిష్టర్ చేయించు విధానంలో నాకు సహాయ, సూచనలు అందజేస్తూ వీటిని అభివృద్ధి చేయటానికి సహకరించవలసిందిగా కోరుతున్నాను. **– పూసర్ల జనార్ధన రావు,** అరసాడ గ్రామం, విజయనగరం జిల్లా.

ఎడిటర్ గారికి,

మీరు ఎన్.ఐ.ఎఫ్. శ్రేయోభిలాషులు. అదేవిధంగా మంచి సృజనా శక్తులను అమూల్యమైన అతి ప్రాధాన్యమైన వినూత్న సృజనలను వెలికి తీయడం, తమయొక్క చేతి వ్రాతల ద్వారా వ్రాసి, ముద్రించడమే కాక, అనేకచోట్ల విస్తరింపజేశారు. అదేవిధంగా నా తోటి స్నేహితులు మాకు కూడా పుస్తకాలు కావాలని అడుగుతున్నారు. ఎటువంటి వాటినైనా మేము చేయడానికి ప్రయత్నిస్తాము అన్నారు. ఎంతోమంది నేను మీకు వ్రాసి ఇచ్చిన మొక్కల మందులు, సృజనాత్మకత గూర్చి చూశారు. పుస్తకాలు వున్నా రహస్య మార్గాలను క్షుణ్ణంగా చదివి వాటిని మనం కూడా భావి తరాలకు చేరవేసి చూపాలి అని అంటున్నారు. అందుకు మేము ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నాము. కొన్ని సృజనాత్మక మందులు, పరిశోధనలకు సంబంధించిన పుస్తకాలను మాకు అందజేయ గలరు అని నన్ను మా స్నేహితులు అడగటం జరిగింది. అందుకు నేను 'పల్లెసృజన' పుస్తకాలను అందించాను. మీరు నాకు ఇచ్చిన పుస్తకాలు వారికి ఎంతగానో నచ్చాయి. "షాజహాన్‌లా తాజ్‌మహల్ కట్టలేను కాని, స్వచ్ఛందంగా నాకు తెలిసింది ప్రజలకు తెలియజేయడానికి నా జీవితాన్ని గడపగలను". **– శ్రీనివాస్,** అరకువేలి.

**(హనీబీ పత్రికకు వచ్చిన కొన్ని ఉత్తరాలను తెలుగులోకి అనువదించి క్రింద ముద్రిస్తున్నాము)**

**శోధయాత్రలో పాల్గొనాలనుంది:**

సిద్ధార్థ అనే నేను యునైటెడ్ స్టేట్స్‌లోని హ్యూస్టన్ నగరంలో నివసిస్తూ ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని. నాకు 'సృష్టి' స్కౌటింగ్‌కు స్వచ్ఛందంగా సేవ చేయాలని వుంది. లిఖిత పూర్వకంగా విజ్ఞాన సమాచారాన్ని భద్రపరచడం, వివిధ ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేయడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే దీనిమూలంగా దీర్ఘకాలంలో జ్ఞాన సముపార్జన, అపార అనుభవం పెరగడమే కాక, ఈ పవిత్ర కార్యానికి సమిధగా ఉపయోగపడటానికి ప్రేరణగా తోడ్పడుతుంది. ఈ యాత్రకు సంబంధించిన కొన్ని తేదీలు, వివరాలు కావాలి. (గ్రామాలను గురించి తెలుసుకునే పయనం – శోధయాత్ర) దీనికి అనుగుణంగా నా భారతదేశ యాత్రను నిర్ణయించుకుంటాను.

**` Siddharth, sidgandhi@lycos.com**

**గతంలో చివరి శోధయాత్ర జూన్ 2009 మాసంలో జరిగింది తరుపరి యాత్ర 2009 డిసెంబర్ లేదా 2010 జనవరి మాసాలలో నిర్వహించబడుతుంది. మీకు అనువైన సమయం, అనుకూల తేదీలను తెలియజేయగలరు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని కేంబ్రిడ్జినుండి ఉత్తర సముద్రం వరకు 2009లో శోధయాత్ర నిర్వహించబడును. – ఎడిటర్.**

**ప్రాచీన ఐ.పి.ఆర్.:**

గత సంచికలో ఎడిటోరియల్‌లో మీరు పేర్కొన్నట్లుగా తనవద్ద విలువిద్యను (పరోక్షంగా) నేర్చుకున్నందుకు భృతి క్రింద ఏకలవ్యుని బొటన వ్రేలును కోరాడు. ఆచార్యత్వం అనేది, జ్ఞానం అనేది తన స్వంత ఆస్తి అని, అపార జ్ఞానసంపదకు అతను అధికారి అని, అజ్ఞానాన్ని ఏకలవ్యుడు ఎలాంటి చెల్లింపు లేకుండా తను హక్కుదారుగా ఉన్న విజ్ఞాన ఖనిని దొంగిలించాడని అందుకు సరైన శిక్షణగా ఏకలవ్యుని బొటనవ్రేలు కోరాడు. ప్రాచీన కాలంలో కూడా భారతీయులు ఈ ఐ.పి.ఆర్.ను అభ్యాసం చేసేవారు.

**B. Dharanidharan, 24, Thillai Natarajan Street, Nehru Ville, Nagar, Pondicherry – 605008**

తాతయ్య, అమ్మమ్మ, నానమ్మల నుండి జ్ఞానానికి సంబంధించిన కబుర్లు మీరు వినడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? ఏకాగ్రతతో రెండుగంటలు వారితో గడపండి. ఆ కబుర్లను మాకు వ్రాసి పంపండి. వారి అనుభవాల పొరల్లో ఎన్నో జ్ఞానాలు దాగుంటాయి. ప్రచురణకు అనువైన వాటిని 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వ్యాసాలను పంపేటప్పుడు మీ ఫొటోతో పాటు మీకు కబుర్లందించిన వారి ఫొటోలను కూడా తప్పక పంపండి. ఈ అపూర్వ సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు వచ్చి, భావితరాలకు అందజేయటానికి మీ సహకారాన్ని కోరుతున్నాము. **– ఎడిటర్.**

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనేటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.

## చందా వివరాలు

| | | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|---|
| సంవత్సరానికి | : | **100/-** | **1,000/-** |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం) | : | **175/-** | **1,750/-** |
| మూడు సంవత్సరాలకు (రెండు పాత సంచికలు ఉచితం) | : | **250/-** | **2,500/-** |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | : | **400/-** | **4,000/-** |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను**
**శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు**
**ఈ క్రింది చిరునామాకు పంపించండి.**

అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

### షేక్ వలీ మస్తాన్ అద్భుత ప్రయోగం

# ఆముదపు నూనెతో డీజిల్ ఇంజన్



కర్నూలు నివాసి షేక్ మస్తాన్ ఒక మెకానిక్. చిన్నప్పటినుండి ఏదో ఒకటి సాధించాలన్న తపనతో సమాజానికి లాభం కలిగే ప్రయోగాలనెన్నింటినో చేశాడు. వాటిలో ప్రధానమైనది డీజిల్ ఇంజన్లను 'డీజిల్'తో కాకుండా 'ఆముదంనూనె'తో చక్కగా నడపడం. 'హనీబీఏపి' ఈ డెమాన్‌స్ట్రేషన్‌లో కర్నూలులో కళ్ళారా చూసింది. స్థానిక పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ శాఖ ప్రొఫెసర్లు డా. బి. వీరభద్రారెడ్డి, వై.వి. మోహన్ రెడ్డిలు కూడా ఈ ప్రయోగాన్ని మెచ్చుకోవడం ముదావహం.

డీజిల్ ఇంజన్‌లోని కొన్ని భాగాలకు మస్తాన్ మార్పులు చేశాడు. దాంతో ఇంజన్ ఆముదపు నూనెతో అదే సామర్థ్ధంతో పని చేస్తున్నది. దీంతో వాతావరణ కాలుష్యంకూడా చాలావరకు తగ్గిపోతుంది.

ఒక సన్నకారు రైతు తన పొలంలో కొంత భాగం ఆముదాలు పెంచుకొని, ఆముదం నూనె తయారు చేసుకొని ఇంజన్‌లో వాడుకోవచ్చు. దాంతో ఆ రైతుకు డీజిల్ ఖర్చు లేకుండా, విద్యుత్ సరఫరాపై ఆధారపడకుండా మిగతా పొలాన్ని ఆముదపు నూనెతో ఇంజన్ నడిపి పంపు ద్వారా సాగునీటిని వినియోగించుకుని చక్కని ఫలితాన్ని పొందగలడు. ఆముదపు పొట్టు మంచి ఎరువు. ఈ సేంద్రియ ఎరువును తన పొలంలో వాడి మంచి ఫలితాలను కూడా పొందవచ్చు. ఒకరకంగా మస్తాన్ ప్రయోగం ఒక వినూత్న విప్లవానికి, రైతు స్వావలంబనకు డీజిల్‌పై ఆధారపడని పద్ధతులకు, సేంద్రియ ఎరువుల ఉపయోగానికి ఉపోద్ఘాతం.

పావు ఎకరలో ఆముదం వేసి పండిస్తే దానినుండి వచ్చే ఆముదపు నూనె ఒక 5 హార్స్‌పవర్‌ల ఇంజన్‌ను సంవత్సరం పొడవునా రోజూ ఆరుగంటల చొప్పున నడపడానికి సరిపోతుందని అంచనా. ఇంజన్ రిపేర్లు చాలా తక్కువగా వుంటాయి. ఆముదపు పొట్టు అదనంగా వాడుకోవచ్చు.

ఈ ప్రయోగాన్ని ప్రమాణీకరణ చేయడానికి 'హనీబీఏపి' మరియు 'టెప్' (డి.యస్.ఐ.ఆర్.)ల తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

– హనీబీఏపి కో-ఆర్డినేటర్, honeybeeap@gmail.com





## ఇగ్నైట్ 2009 మొదలైంది

పాఠశాల విద్యార్థులు తమ భావాలను, సూచనలను, పరిశోధనలను, సాంప్రదాయక విజ్ఞానాన్ని ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

(పూర్తి వివరాలకై 20వ పేజి చూడండి)

**నేషనల్ కో-ఆర్డినేటర్**
**(స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్)**
**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్**
**బంగళా నెం. 1,**
**శాటిలైట్ కాంప్లెక్స్,**
**ప్రేమ్‌చంద్ నగర్ రోడ్,**
**అహమ్మదాబాద్ - 380 015. గుజరాత్.**
**ఫ్యాక్స్ (079) - 26731903**
ఈమెయిల్ :ignite09@nifindia.org
www.nifindia.org

## సృష్టి యువ యాంత్రిక్ అవార్డు / యువ సాంకేతిక నిపుణుల అవార్డు

సాంకేతిక విద్యార్థులు (బి.టెక్ / బి.ఎస్‌సి., ఎమ్.టెక్., పిహెచ్.డి.)

వారి వారి సూచనలు / భావనలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులు ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

బి/హెచ్ ఫార్మసి కాలేజ్ మెస్,
బాలుర హాస్టల్ క్యాంపస్ దగ్గర
యూనివర్సిటీ ఏరియా
నవరంగపుర, అహమ్మదాబాద్ - 380 009.
గుజరాత్ - ఇండియా.
ఫ్యాక్స్ : 079-26307341
ఈమెయిల్ : innovation09@sristi.org
innovationsristi09@gmail.com
website : http//www.sristi.org

## ఎంట్రీలు పంపుటకు చివరి తేది : 31 ఆగస్టు, 2009

**IGNITE 2009 has begun......**

School children may send their ideas, innovations and traditional knowledge practices to ignite09@nifindia.org

**SRISTI YuvaYantriki Award/Young Technologist Award**

Technology students (B Tech/B Sc, M Tech, Ph D) can send their outstanding ideas, innovations and projects, full or summary, ideas and innovations to innovation09@sristi.org, innovationsristi09@gmail.com

## పల్లెసృజన చందా వివరాలు

| | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | : 100/- | 1,000/- |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం): | 175/- | 1,750/- |
| మూడు సంవత్సరాలకు(2 పాత సంచికలు ఉచితం): | 250/- | 2,500/- |
| ఐదు సంవత్సరాలకు(4 పాత సంచికలు ఉచితం) | : 400/- | 4,000/- |

మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు ఈ క్రింది చిరునామాకు పంపించండి.

అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655